www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 29 | ఆగస్టు | 2025
పేజీలు : 8

# పాముకాటుతో చిన్నారి మృతి

తల్లి పరిస్థితి విషమం







2 లో

# ఉమ్మడి జిల్లాలో భారీ వర్షం





## పొంగుతున్న వాగులు, వంకలు
### -పలు చోట్ల రాకపోకలకు అంతరాయం
### -పెరుగుతున్న మున్నేరు

ప్రజాపక్షం/ ఖమ్మం : ఉమ్మడి ఖమ్మంజిల్లాలో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇటు ఖమ్మం, అటు భద్రాద్రి కొత్తగూడెం లోనూ బుధవారం నుంచి గురువారం ఉదయం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పలు కాలనీల్లోకి నీరు రాగా పలు చోట్ల వాగులు పొంగి రాకపోకలకు అంతరాయం కలిగింది. ఖమ్మంజిల్లా చింతకాని మండలం రామకృష్ణాపురం వద్ద వాగు ఉధృతికి రోడ్డు పైకి నీరు చేరడంతో బోనకల్, ఖమ్మం మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. సత్తుపల్లిలో పలు కాలనీల్లో వరద పోటెత్తింది. సత్తుపల్లిలోని ఎన్‌టిఆర్ నగర్ తదితర ప్రాంతాలకు వరద నీరు చేరడంతో రాకపోకలు స్తంభించాయి. దమ్మపేట మండలంలో నెమలిపేటలో ఇండ్లు నీట మునిగాయి. వరద ఉధృతికి విష సర్పాలు రావడంతో ప్రజలు

మిగతా 2లో..

# మొదలైన స్థానిక సందడి

## -గ్రామ పంచాయతీల ఓటర్ల జాబితా విడుదల




ప్రజాపక్షం/ ఖమ్మం : గ్రామాల్లో స్థానిక సందడి మొదలైంది. గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా గురువారం విడుదల కావడంతో రాజకీయ పక్షాలు, ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న అభ్యర్థులు ఓటరు జాబితాపై దృష్టి సారించారు. ఈనెల 30 వరకు మార్పులు, చేర్పులకు అవకాశం ఉండడంతో ఓటర్ల జాబితాను రాజకీయ పార్టీలు నిశితంగా పరిశీలిస్తున్నాయి సెప్టెంబర్ మొదటి వారంలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల అవుతుందన్న నేపథ్యంలో గ్రామాల్లో రాజకీయాలు క్రమ క్రమంగా వేడెక్కుతున్నాయి. 2024 జనవరితో పంచాయతీ పాలక వర్గాల పదవి కాలం ముగిసింది. అప్పటి నుంచి గ్రామ పంచాయతీలు ప్రత్యేక అధికారుల పాలనలోనే ఉన్నాయి. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో తీర్మానం చేసిన దానికి సంబంధించి చట్టం రూపొందకపోవడంతో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే ప్రత్యామ్నాయ మార్గాలను రాష్ట్ర ప్రభుత్వం అన్వేషిస్తుంది. పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో పాటు ఇతర మార్గాలను కూడా పరిగణలోకి తీసుకుంటుంది. ఇప్పటికే మంత్రి వర్గ ఉప సంఘం ఏర్పాటు చేయగా ఉప సంఘం నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకుని సెప్టెంబర్ మొదటి వారంలో నోటిఫికేషన్ విడుదల చేసేందుకు సిద్ధమైంది. గ్రామ పంచాయతీల్లో ఓటర్ల జాబితాను సిద్ధం చేయడంతో పాటు వార్డుల వారీగా జాబితాలను విడుదల చేశారు.

### భద్రాద్రి జిల్లాలో యూరియా కోసం

# రైతు సంఘం ఆందోళన

## -తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాలు, అధికారులకు వినతి పత్రాలు




ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : యూరియా కొరతను నివారించాలని బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా గురువారం మండల తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహించారు. డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాలను అధికారులకు అందజేశారు. పాల్వంచలో జరిగిన కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం పాల్గొన్నారు. పలుచోట్ల జరిగిన ఆందోళన కార్యక్రమాలకు రైతు సంఘం నాయకులు నరేందర్, సిపిఐ నాయకులు, రైతు సంఘం బాధ్యులు నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం, సిపిఐ నాయకులు మాట్లాడుతూ సకాలంలో యూరియా అందించడంలో పాలక వర్గాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. పంట సాగు విస్తీర్ణాన్ని అంచనా వేయడంలో వైఫల్యమే ఈ పరిస్థితికి కారణమైందని వారు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం యూరియా సరఫరాలో వివక్ష ప్రదర్శిస్తుందని తెలిసినా రాష్ట్ర ప్రభుత్వం అందుకు అనుగుణంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయలేదని సిపిఐ రైతు సంఘం నేతలు ఆరోపించారు. ఇప్పటికైనా తక్షణం రైతులకు యూరియా అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఆ త్యాగాలు వృథా కాలేదు



## -విజయాలను అందించిన మహోత్తర విద్యుత్ పోరాటం
## -విద్యుత్ అమరులకు వామపక్షాల ఆధ్వర్యంలో ఘన నివాళి

ప్రజాపక్షం/ ఖమ్మం : విద్యుత్ పోరాటం భారతదేశ ఉద్యమ చరిత్రలో ఓ మహోత్తర ఘట్టమని ఆ పోరాటంలో ఆసువులు బాసిన అమరుల త్యాగాలు, అలుపెరగక పోరాడిన కార్యకర్తల పోరాట పటిమ వృథా కాలేదని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. విద్యుత్ పోరాట ఫలితంగానే విద్యుత్ ప్రైవేటీకరణ ఆగిపోయిందని ఉచిత విద్యుత్ అమలైందని నేటికీ పాలక వర్గాలు రైతులకు ఉచిత విద్యుత్, పేదల ఇండ్లకు ఉచితంగా విద్యుత్‌ను అందిస్తున్నారంటే అది 2000 సంవత్సరం నాటి పోరాట ఫలితమేనని ఆయన తెలిపారు. చంద్రబాబు నాయుడు పాలనలో విద్యుత్ ఛార్జీల వ్యతిరేక పోరాటంలో

మిగతా 2లో..

# ఉమ్మడి జిల్లాలో భారీ వర్షం

**మొదటిపేజీ తరువాయి)**

తీవ్ర ఆందోళనకు గురయ్యారు. బోనకల్ మండలంలో రాళ్లవాగు ఉప్పొంగి రాయన్నపేట, కలకోట గ్రామాల మధ్య ప్రజా రవాణా నిలిచిపోయింది. ఖమ్మం రూరల్ మండలంలోని శ్రీరాం నగర్ కాలనీలోకి వరద చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొణిజర్ల మండలం అంజనాపురం వద్ద వాగు ఉప్పొంగడంతో పల్లిపాడు, ఏన్కూరు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వైరా నదికి ఎగువ భాగంలో కురిసిన వర్షాలతో వరద పోటెత్తడంతో వైరా నది ఉధృతంగా ప్రవహిస్తుంది. లక్ష్మి పురం వద్ద వంతెనపై నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిపివేశారు. మధిర సమీపంలో వైరా నది ఉధృతిని అధికారులు పర్యవేక్షిస్తున్నారు. మున్నేరుకు క్రమేపి వరద ప్రవాహం పెరుగుతుంది. గురువారం సాయంత్రానికి తొమ్మిదిన్నర అడుగులకు చేరుకుంది. పెనుబల్లి మండలంలంకాసాగర్ ప్రాజెక్టుకు వరద పోటెత్తడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అధికార యంత్రాంగం ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఖమ్మం సిపి సునీల్ దత్, భద్రాద్రి కొత్తగూడెం ఎస్పి రోహిత్ రాజ్ వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఇదిలా ఉండగా నదులు, వాగుల పరివాహక ప్రాంతాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వరద తగ్గితే కానీ పంటలను అంచనా వేయాల్సి ఉంది.

# ఆ త్యాగాలు వృథా కాలేదు

**మొదటిపేజీ తరువాయి)**

భాగంగా బషీర్‌బాగ్ వద్ద పోలీస్ కాల్పుల్లో మృతిచెందిన అమరవీరులకు గురువారం సిపిఐ, సిపిఎం, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. రామకృష్ణ స్మారక స్తూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం డివిజన్ కార్యదర్శి వై. విక్రం అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ నాయకులు బాగం హేమంతరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ (ఎంఎల్)మాస్‌లైన్ నాయకులు సివై పుల్లయ్య తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ రంగంలో సంస్కరణలను తీసుకు రావడాన్ని, ప్రైవేటీకరణను వామపక్షాలు అడ్డుకున్నాయని అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో తొమ్మిది వామపక్ష పార్టీలు మహత్తర పోరాటాన్ని నిర్వహించాయని ఆయన తెలిపారు. ఆ పోరాట ఫలితంగా అప్పట్లో ప్రైవేటీకరణ ఆగిన మోడీ విద్యుత్‌ను రాష్ట్రాల పరిధి నుండి లాగేసుకుని జిఎస్టి పేరుతో నానా ఇబ్బందులు పెడుతున్నారని వారు ఆరోపించారు. సంస్కరణలు, ఆర్థిక విధానాలు మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజల పక్షాన పోరాడేందుకు వామపక్షాలు సిద్దంగా ఉన్నాయని అమరవీరుల సాక్షిగా పోరాటానికి సంసిద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కె జానిమియా, బిజి క్లైమెంట్, శింగు నర్సింహారావు, పోటుకళావతి, రావి శివరామకృష్ణ, సిహెచ్ సీతామహాలక్ష్మి, మేకల శ్రీనివాసరావు, ఏనుగు గాంధీ, గాదె లక్ష్మి నారాయణ, ఎస్‌కె సైదా, బోడా వీరన్న, సిపిఎం నాయకులు బండి రమేష్, రమేష్, యర్రా శ్రీను, బండి పద్మ, యర్రా గోపి, మాస్‌లైన్ నాయకులు ఆవుల అశోక్, రామయ్య, ఝాన్సీ పాల్గొన్నారు.

# ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి



**-అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు**
**-కంట్రోల్ రూము ఏర్పాటు**
**-వరద ప్రవాహన్ని పరిశీలించిన కలెక్టర్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. జిల్లాల్లో కురుస్తున్న వర్షాలకు చింతకాని మండలం రామకృష్ణాపురం చెరువు అలుగు పారి ఉధృతంగా ప్రవహిస్తున్న ఖమ్మం, బోనకల్ ప్రధాన రహదారిలోని ధంసలాపురం వద్ద గురువారం వరద ప్రవాహాన్ని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వాహనాల రాకపోకలు, ప్రజలు బ్రిడ్జి దాటకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లాలో అధికారులు పూర్తి సంసిద్దతతో స్థానికంగా ఉంటూ పని చేయాలన్నారు. వర్షం, వరదను అంచనా వేస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూము ఏర్పాటు చేశామని ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే కంట్రోల్ రూము నెం. 1077, వాట్సప్ సెల్ నెం. 9063211298 లను వర్షం, వరద ప్రభావిత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు సిద్దంగా ఉన్నాయన్నారు. వర్షాలకు చెరువులు అలుగులు పారే అవకాశం ఉన్నందున్న ప్రజలు స్వీయ జాగ్రత్తలు పాటించాలన్నారు. ఉధృతంగా ప్రవహించే వాగులు, చెరువుల సమీపంలోని రోడ్లు, వంతెనలపై రాకపోకలను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ తహసీల్దార్ సైదులు, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, కార్పొరేటర్ మేడారపు వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కొలువుదీరిన గణనాధులు





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వినాయక నవరాత్రోత్సవాలకు గణనాధులు మండపాల్లో కొలువుదీరారు. భాద్రపద మాసంలో వచ్చే చవితి రోజు వినాయక చవితిని నిర్వహిస్తారు. బుధవారం వినాయక చవితిని పురస్కరించుకుని బహుళ అంతస్తులతో పాటు వాడ వాడలా మండపాలను ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా తొమ్మిది రోజుల పాటు గణనాధులు పూజలు అందుకోనున్నారు. మండపాలను వివిధ రూపాల్లో అందంగా అలంకరించారు. పూజా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గణేషున్ని పూజించారు. ఎటువంటి విఘ్నాలు లేకుండా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండేలా జీవించాలని స్వామి వారికి పూజలు నిర్వహించారు.

# పాముకాటుతో చిన్నారి మృతి

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఇంట్లో నిద్రిస్తున్న తల్లీ కూతుళ్ళను పాము కాటు వేసింది. ఈ ఘటనలో చిన్నారి మృతి చెందగా, తల్లి పరిస్థితి విషమంగా ఉంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... సత్తుపల్లి మండలం చిన్న పాకలగూడెం గ్రామానికి చెందిన గౌర గోపి, మౌనిక దంపతులు తమ పిల్లలతో కలిసి ఇంట్లో నేలపైన నిద్రిస్తున్నారు. గురువారం తెల్లవారుజామున ఇంట్లోకి ప్రవేశించిన కట్ల పాము (విష సర్పం) తల్లి పక్కన నిద్రిస్తున్న చిన్న కుమార్తె లోహిత (5)ను, తల్లి మౌనికను కాటు వేసింది. దీంతో కుటుంబ సభ్యులు లేచి పామును గుర్తించి చంపి వైద్య సేవల నిమిత్తం గౌర లోహిత (5)ను, తల్లి మౌనికను 108 లో సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ లోహిత (5)) మృతి చెందింది. తల్లి మౌనిక పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్య సేవల నిమిత్తం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. లోహిత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీలో భద్రపరిచారు. పాముకాటుతో చిన్నారి లోహిత మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# నీరు నిల్వ లేకుండా చూడాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వర్షాల కారణంగా రోడ్లపై నీరు నిల్వ లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. వర్షాల కారణంగా ఖమ్మం నగరంలో నీరు నిలిచిన ప్రాంతాల్లో గురువారం కమిషనర్ అభిషేక్ అగస్త్య పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు నిల్వ లేకుండా యుద్ధ ప్రాతి పదికన చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే అదనపు సిబ్బందిని వినియోగించాలన్నారు. అవసరం ఉన్న చోట యంత్రాలను ఉపయోగించి నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. డ్రైనేజీలపై ఉన్న స్లాబులను తొలగించి నీరు సులభంగా పోయేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. రాపర్తి నగర్ ఫ్లైఓవర్ వద్ద కల్వర్టులో నీరు నిల్వ ఉందని గమనించిన కమిషనర్ రైల్వే అధికారులతో చర్చించి సమస్య పరిష్కారం అయ్యేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.

# ఓటరు జాబితా ప్రదర్శన



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గ్రామ పంచాయతీల్లో ఓటరు జాబితాను అధికారులు ప్రదర్శించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గురువారం రఘునాథపాలెం మండలంలో పలు గ్రామ పంచాయతీల్లో ఓటర్ల జాబితాను అధికారులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంపివో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీలో వార్డుల వారీగా ఓటరు జాబితాను ప్రదర్శించినట్లు ఆయన తెలిపారు. ఓటరు జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే శుక్రవారం లోపు తెలపవచ్చునని ఆయన తెలిపారు. వచ్చే నెల రెండున తుది జాబితాను విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు.

# కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కళ్యాణలక్ష్మి షాదీముబారక్ చెక్కులను లబ్దిదారులకు ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు పంపిణీ చేశారు. మండల పరిధిలోని బూడిదంపాడు, విఆర్‌బంజర గ్రామాల్లో లబ్దిదారులకు మంజూరైన చెక్కులను ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ది చేకూరుతుందన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లతో పాటు ప్రభుత్వ పథకాలను అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ వాంకుడోత్ దీపక్ నాయక్, ఆత్మ కమిటీ ఛైర్మన్ దిరిశాల చిన్నవెంకటేశ్వర్లు, ఆయా గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పేకాటరాయుల అరెస్టు

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** పట్టణ సమీపంలోని భద్రాచలం రోడ్డులో డంపింగ్ యార్డ్‌లో ఐదురుగు వ్యక్తులు పేకాట ఆడుతుండగా గురువారం సమాచారం మేరకు ఎస్ఐ యాయతి రాజు తన సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నారు. వారి వద్ద నుండి రూ. 2,910నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# మండపాల్లో కొలువుదీరిన గణపయ్యలు



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** వినాయక చవిత పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు మండపాల్లో వినాయకుని విగ్రహాలను నెలకొల్పి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలో పెద్ద ఎత్తున భక్తులు మండపాలను ఏర్పాటు చేశారు. రంగుల రంగుల తోరణాలు, లైటింగ్స్ ఏర్పాటు చేసి భక్తిశ్రద్దలతో పూజలు నిర్వహించారు.

# అధికారులు జవాబుదారితనంతో పని చేయాలి



**-ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరు నమోదు**
**- ప్రతి విద్యార్థికి అపార్ నెంబర్ జనరేట్ చేయాలి**
**-విద్యాశాఖపై అదనపు కలెక్టర్ సమీక్ష**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అధికారులు జవాబుదారితనంతో పని చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజ తెలిపారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ గురువారం విద్యాశాఖపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాల పంపిణీ, అపార్ రిజిస్ట్రేషన్, ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ తదితర అంశాలపై మండలాల వారీగా అదనపు కలెక్టర్ సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఏకరూప దుస్తులు మొదటి జత రాని విద్యార్థుల జాబితా రెండవ జత రాని వివరాలను అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఏకరూప దుస్తులు రెండు జతలు పంపిణీ చేసినప్పటికీ ఆన్‌లైన్ నమోదులో సాంకేతిక సమస్యలు వస్తున్నాయని వీటిని గుర్తించి పరిష్కరించాలన్నారు. ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్, నోటుపుస్తకాల పంపిణీ పూర్తి చేయాలని, ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కొత్తగా చేరిన విద్యార్థులు కూడా పాఠ్యపుస్తకాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ జవాబుదారితనంతో పని చేయాలని, విద్యార్థుల వారీగా వివరాలు జిల్లా లాగిన్‌లో నమోదయ్యేలా సిఎంవో పర్యవేక్షించాలన్నారు. జిల్లాలోని ఉపాధ్యాయులు, విద్యార్థుల పెండింగ్ ఎఫ్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అపార్ నెంబర్ జనరేట్ చేయాలన్నారు. పదోన్నతులు లభించిన ఉపాధ్యాయులు, సిబ్బంది రిలీవ్, నూతన వర్క్‌ప్లేస్ జాయినింగ్ పూర్తి చేయాలన్నారు. జిల్లాలో అవసరానికి మించి టీచర్లు ఉన్న పాఠశాలల జాబితా తయారు చేయాలన్నారు. పదోన్నతుల కారణంగా ఏర్పడిన ఖాళీలలో ఆ టీచర్లను అడ్జెస్ట్ చేస్తూ సెప్టెంబర్‌లో ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డివో సన్యాసయ్య, విద్యాశాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్ రామకృష్ణ, మండల విద్యాశాఖాధికారి ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, ఏపిఎంలు, సిఆర్‌పిలు, ఏఎస్‌వోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రవీందర్ మృతి.. సిపిఐకి తీరనిలోటు : దండి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** కొత్తకొండ రవీందర్ మృతి సిపిఐకి తీరనిలోటని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. గురువారం ఖమ్మంరూరల్ మండలం ఎంవీ,పాలెం గ్రామంలో ఆయన సంస్మరణ సభను శాఖ సెక్రటరీ మెట్ల యాదయ్య అధ్యక్షతన నిర్వహించారు. తొలుత అక్కడ ఏర్పాటు చేసిన చిత్రపటానికి జిల్లా, మండల పార్టీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దండి మాట్లాడుతూ...పార్టీ ఇచ్చిన ప్రతి పిలుపులో రవీందర్ సైనికుడిలా? ముందుండి నడిచే వాడన్నారు. నిఖ్కార్సైన కమ్యూనిస్టుగా ఈ ప్రాంతంలో పార్టీ అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశాడని కొనియాడారు. అతని కుటుంబానికి సిపిఐ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని భరోసాను కల్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిద్ధినేని కర్ణకుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, జిల్లా సమితి సభ్యులు యడ్లపల్లి శంకరయ్య, ఉన్నం రంగారావు, వెంపటి సురేందర్, పగిళ్ల వీరభద్రం, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, మండల సమితి సభ్యులు లింగా వెంకటనారాయణ, పొసంగుల చంద్రరావు, బానోత్ రామ్మూర్తి, అజ్మీర జగన్, దోమల వెంకటనారాయణ, జిల్లా సిపిఎం నాయకులు నంద్ర ప్రసాద్, సిపిఐ ఎమ్మెఎల్ నాయకులు వేగినాటి సత్యం, కాంగ్రెస్ నాయకురాలు నాగమణి పాల్గొన్నారు.

# ఆనాటి నేతలే నేటి తరానికి ఆదర్శం



**ప్రజాపక్షం/ మధిర :** పేద ప్రజల కోసం తమ జీవితాలను అంకితం చేసి పోరాడిన నాటి అమరవీరుల త్యాగాలు స్మరించు కూంటూ వారి ఆశయాల సాధన కోసం నేటి తరం కమ్యూనిస్టులు కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, జిల్లా కార్యవర్గ సభ్యురాలు మందడపు రాణి అన్నారు. శుక్రవారం సిపిఐ సీనియర్ నేత మంగళగిరి రామానుజం సతీమణి లీలావతి ప్రథమ వర్థంతి సభ సిపిఐ మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు అధ్యక్షతన మధిర పట్టణంలోని సిద్ధార్థ బజార్‌లో జరిగింది. ముందుగా లీలావతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై కమ్యూనిస్టుపార్టీ ఉద్యమించిన పోరాటాల్లో మంగళగిరి లీలావతి తన భర్త రామానుజంతో కలిసి అనేక ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించారన్నారు. సమసమాజ నిర్మాణం కోసం పొరాడిన ఆనాటి లీలావతి లాంటి నేతలే నేటి తరానికి ఆదర్శం అన్నారు. ఈ కార్యక్రమంల సిపిఐ జిల్లా సమితి సభ్యులు పెరుమాళ్ళపల్లి ప్రకాశరావు, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, తలారి రమేష్, శిరివేరి శ్రీనివాసరావు,పరచూరి రాము, నీరుకొండ మురళీ, కొండూరి నాగేశ్వరరావు, ఊట్ల రామకృష్ణ, మచ్చ వెంకటేశ్వరరావు, నర్సింహారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం-బోనకల్ ప్రధాన రహదారి మూసివేత



**లోతట్టు గ్రామాలు జలమయం**





**ప్రజాపక్షం/చింతకాని :** గత రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో చింతకాని మండలం తడిసి ముద్దయింది. వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లగా అనేక రహదారులు కోతకు గురికాగా పలు గ్రామల మధ్య రవాణా నిలిచిపోయింది. వరద ప్రభావానికి ఖమ్మంబోనకల్ ఆర్అండ్‌బీ రహదారి రామకృష్ణాపురం , పందిళ్లపల్లి సమీపంలో కోతకు గురయ్యాయి. పందిళ్లపల్లి సమీపంలో ఓ వ్యక్తి వరద నీటిఒకి అడ్డుగా భారీ నిర్మాణం చేపట్టటంతో కొద్దిపాటి వర్షానికి సైతం వరద నీరు రోడ్డుపైకి చేరుతుందని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రామకృష్ణాపురం సమీపంలో లోలెవల్ వంతెన సగం దెబ్బతింది. రామకృష్ణాపురం కందికుంట చెరువు అలుగు ద్వారా వచ్చే వరద నీటితో ఖమ్మం బోనకల్ ప్రధాన రహదారిపై నాలుగు అడుగుల మేర వరద చేరింది.దీంతో ఈ మార్గంలో రవాణాను పోలీసులు, రెవెన్యూ సిబ్బంది నిలిపివేశారు. గురువారం ఉదయం జిల్లా కలెక్టర్ అనుదీప్ వరద ఉతృతిని పరిశీలించారు.ఆర్అండ్‌బీ, నీటిపారుదల శాఖ, రెవెన్యూ అధికారులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. వరదల దృష్ట్యా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. అధికారులంతా స్థానికంగా ఉండాలని ఆదేశించారు. లచ్చగూడెం, చింతకాని , నర్సింహాపురం, తిమ్మినేనిపాలెం, బొప్పారం, పాతర్లపాడు, రామకృష్ణాపురం గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లోనిపలు ఇళ్లలోకి వరద నీరు చేరింది. ఆయా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో కందకాలు తీసి నీటిని బయటకు పంపే ఏర్పాట్లు చేశారు. లచ్చగూడెం , చింతకాని లో వర్షాలు , వరదల వల్ల దెబ్బతిన్న ప్రాంతాలను, చెరువు అలుగుల పరిస్థితిని నీటిపారుదలశాఖ ఈఈ రాంప్రసాద్ గురువారం పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో భాగంగా ఇసుక బస్తాలను సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి




**ప్రజాపక్షం/ మధిర :** జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ సూచించారు. గురువారం మధిరలోని వైరా నది వరద నీటితో పొంగి ప్రవహిస్తుండగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు, చెరువుల ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, ఎవరు కూడా చేపల వేటకు వెళ్లవద్దని తెలిపారు. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని పిల్లలు, ఇంట్లో నుంచి బయటకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలన్నారు. అత్యవసర సమయాల్లో డయల్ కంట్రోల్ సెంటర్ల నెంబర్లు 8374856402 9866776641 9848896795కు సమాచారం అందించాలని తెలిపారు. ఇప్పటికే శివాలయం ఉన్న మున్నేరు వాగు వద్ద మున్సిపల్ సిబ్బంది ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు. పలు గ్రామాల్లో వాగుల వద్ద నీటి ఉధృతిని దృష్టిలో ఉంచుకుని బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రమాదాల బారిన పడకుండా వాహనాల రాకపోకలను నిషేధించారు. అదేవిధంగా ఎగువ ప్రాంతంలో అధిక వర్షాలు కురిసిన నేపథ్యంలో వాగు వరద ఉధృతి పెరిగే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులను అప్రమత్తం చేశారు.

# పెనుబల్లి మండలంలో పొంగి పొర్లుతున్న వాగులు





**డ్రైనేజీలు నిండి రోడ్లపై చేరుతున్న వరద నీరు**



**ప్రజాపక్షం/పెనుబల్లి:** అల్పపీడన ప్రభావంతో గత మూడు రోజులుగా పెనుబల్లి మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం రాత్రి భారీ వర్షం కురవడంతో మండలంలోని వాగులు పొంగి పొర్లుతున్నాయి. డ్రైనేజిలు నిండి రోడ్లుపై వరద నీరు ప్రవహిస్తున్నాయి. చెరువులు నిండి జల కళను సంతరించుకున్నాయి. పెనుబల్లి రాథోని చెరువు, లంకసాగర్ చెరువు నిండు కుండని తలపిస్తున్నాయి. లంకాసాగర్ ప్రాజక్ట్ నీటి సామర్థ్యం 16 అడుగులు కాగా బుధవారం, గురువారం కురిసిన వర్షాలకు 16 అడుగులు మించి వరద నీరు చేరుకోవడంతో అలుగు ప్రవహిస్తుంది. రాథోని చెరువు నీటి సామర్థ్యం దాటి నీరు చేరింది. అలుగుపడి భారీగా వరద దిగువ ప్రాంతాలకు ప్రవహిస్తుంది. సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తిలింగం, విఎం బంజర్ ఎస్ఐ ఐబి సిబ్బందితో కలిసి లంకాసాగర్ ప్రాజెక్టు వద్ద నీటి ప్రవాహ పరిస్థితులను పరిశీలించారు. మండలంలోనిభారీ వర్షాలకు జనజీవనం స్థంబించింది. లోతట్టు ప్రాంతాలలోని ఇళ్లలోకి వరద నిరుచేరడంతో ఇబ్బందులకు గురైయ్యారు. పలు కాలనీలలో నీరు ప్రవహిస్తుంది. వియం బంజర్ గ్రామంలోని పాత లోతట్టు కాలనీ భారీగా వరద నీరు ప్రవహిస్తుంది. కాలనీ వాసులు బయటకు వచ్చేందుకు నానా యాతనలు పడుతున్నారు. వియం బంజర్ ఎస్సీ కాలనీలో ప్రతి సంవత్సరం మాదిరిగానే ఇళ్లలోకి వరద నీరు చేరడంతో అవస్థలకు గురైయ్యారు. భారీ వర్షాలకు కొన్ని ప్రాంతాలలో వరి పంట నీట మునిగింది. మండల గ్రామంలోని రోడ్లు జలమయమయ్యాయి. భారీ వర్షాల కారణంగా ప్రజలు ప్రమాదంగా ఉండాలని సీఐ ముత్తిలింగం మండల ప్రజలకు సూచించారు. వాగులు, వంకల వద్దకు ఎవరు వెళ్లవద్దని తెలిపారు. భా రీ వర్షాలతో విద్యుత్ పరికరాల జాగ్రత్తగా వహించాలని కరెంటు స్తం భాలను ముట్టుకోవద్దని సూచించారు. ఇండ్లలో విద్యుత్ పరికరాల పట్ల తగు జాగ్రత్తలతో మెలగాలని వినాయక మండపాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా పోలీసు శాఖ మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల అభ్యున్నతి



**ప్రజాపక్షం/బోనకల్:** కాంగ్రెస్‌తోనే రాష్ట్రంలో పేదల అభ్యున్నతి సాధ్యమవుతుందని కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు బోయినపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో ఇటీవల చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులను కాంగ్రెస్ బృందంతో కలిసి ఆయన మాట్లాడారు. ముందుగా గ్రామంలోని పెద్దిపాక అంబేద్కర్ ఇందిమ్మ ఇంటి బేస్‌మెంట్ బిల్లు రూ.1 లక్షను కాంగ్రెస్ బృందానికి చూపించి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి బంధం నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా నాయకులు బంధం శ్రీనివాసరావు బోయినపల్లి మురళి, షేక్ ముస్తాఫా, షేక్ జానిమియా, షేక్ షాజహాన్, షేక్ బాబు, సురభి నరసింహరావు, చిట్టెంశెట్టి మురళి, ఆళ్ల వెంకటరెడ్డి, దొడ్డ నాగేశ్వరరావు, పండగ సీతారాములు, కొట్టె వినయ్, పెద్దిపాక సాంబ, కుటుంబరావు, యేసు, బోయిన లక్ష్మయ్య, కాంగ్రెస్ మహిళా నాయకురాలు అమరేసి ప్రమీల, యూత్ కాంగ్రెస్ షేక్ చాంద్‌పాషా, బెజవాడ అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు సరిపడా యూరియాను అందించాలి



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** రైతులకు సరిపడా యూరియాను వెంటనే అందించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, వ్యవ సాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు ఎల్లయ్య అన్నారు. గురు వారం సిపిఐ అనుబంధ రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమంలో భాగంగా మండలంలోని రైతులందరికీ సరిపడా యూరియా అందించాలని సిపిఐ మండల కార్యదర్శి కొమరం హనుమంతరావు అధ్యక్షతన తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, వినతి పత్రం అందించారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఎస్‌కే రహీం, మండల కార్యవర్గ సభ్యులు కుంట సహదేవ్, రేసు సురేం దర్, మద్దెల వెంకటేశ్వర్లు, తాళ్లపల్లి శ్రీను, తాళ్లపల్లి రమేష్, తాళ్లపల్లి సాయన్న, బొమ్మల నారాయణ, అరేం రామకృష్ణ, వజ్జా వసంతరావు, వజ్జ కళ్యాణ్, వజ్జ రమేష్, ఆదినారా యణ, కోరం రంగయ్య, ఎల్లబోయిన నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## యూరియాను అందిచడంలో ప్రభుత్వం విఫలం



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి మండలాలలో నిరసన కార్యక్రమంలో భాగంగా సిపిఐ మండల కార్యదర్శి ఊకె నారాయణ, ఏఐకేఎస్ ఆధ్వర్యంలో యూరియా కొరతను నిర సిస్తూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం మండల ప్రధాన కేంద్రంలో అంబేద్కర్ ప్రధాన సెంటర్ నుండి మండల తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీని చేపట్టారు. ఈసందర్భంగా ఉకే నారాయణ మాట్లాడుతూ రైతులకు యూరియా పంపిణీలో అవినీతి పైరవీలు దారి వ్యవస్థను అదుపు చేసి ప్రతి రైతుకు యూరియా అందిం చాలని, ఎరువులు పురుగుమందుల విషయంలో కూడా సబ్సిడీ అందే విధంగా చూడాల న్నారు. సకాలంలో యూరియా అందకపోవడం వలన అప్పులు చేసే వ్యవసాయం చేస్తున్న రైతుకలు పైరు ఎదుగుదల దిగుబడి లేక విలవిలలాడుతున్నారని, వ్యవసాయ పని ముట్లు కూడా సబ్సిడీలో అందించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని రైతులకు ఇబ్బంది పెట్టకుండా వారికి రావలసిన అన్ని విధాల ప్రయోజనాలను అందించే దిశగా పని చేయాలని తెలిపారు. అనంతరం రైతులకు సకాలంలో యూరియాను అందించే విధంగా ఉన్నతాధికారులకు తెలిపి చర్యలు చేపట్టాలని మండల తహసీల్దార్ పుల్లారావుకు వినతి పత్రం అందించారు. ఈకార్యక్రమంలో పలగాని రామకృష్ణ, సున్నం వెంకటేశ్వర్లు, పల గాని కృష్ణయ్య, సున్నం సావిత్రి, వేముల వెంకటేశ్వర్లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులందరికీ యూరియా అందించాలి



**ప్రజాపక్షం/అశ్వాపురం:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యూరియా సరఫరాను పెంచి రైతులందరికీ యూరియా అందిం చాలని, కేంద్ర ప్రభుత్వం వివక్షను విడనా డలని, రాష్ట్ర వ్యాప్తంగా బ్లాక్ మార్కెట్‌లో యూరియా అధిక ధరల అమ్మకాలను నివారించాలని కోరుతూ సిపిఐ పార్టీ, రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం అశ్వాపురం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, రెవెన్యూ ఇన్స్పెక్టర్‌కి వినతి పత్రం అందించారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కమటం సురేష్, సిపిఐ మండల కార్యదర్శది అనంతనేని సురేష్, ఏఐటియూసి జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లి కార్జున్, ఏఐటియూసి మండల అధ్యక్షులు రాయపూడి రాజేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఈనపల్లి పవన్ సాయి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు అక్కినపల్లి నాగేంద్ర బాబు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## రహదారిపై గుంతలు పూడ్చివేత



**ప్రజాపక్షం/పాల్వంచ :** గత మూడు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ధ్వంసమై గుంతలు పడిన రహదారిని కార్పోరేషన్ కమీషనర్ సుజాత దగ్గరుండి పూడ్పించారు. డ్రైనేజీ సౌకర్యం లేకపోవటంతో నవభారత్‌లోని కబీర్ తండాలో వర్షపు నీరు ఇండ్లలోకి చేరింది. స్థాని కులు కమీషనర్ కు వాట్సాప్ ద్వారా సందేశం పంపించారు. దీనితో అధికారులు సమస్యను పరిష్కరించారు. స్థానిక దమ్మపేట సెంటర్ నుండి శ్రీనివాస కాలనీ రహదారి అడుగుకో గుంత అన్నట్లుగా తయారైనది. కొద్దిపాటి వర్షానికే కోట్ల నిధులతో నిర్మించిన ప్రధాన రహదారి ధ్వం దీనితో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిలిచిన వర్షపు నీటిలో పడి పలువురు గాయాల పాల య్యారు. ప్రజల నుండి పలు విమర్శలు వెల్లువెత్తాయి. స్పందించిన కమీషనర్ సుజాత స్వయంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మున్సిపాలిటీ సిబ్బందితో గుంతలను పూడ్పిం చారు. దీనితో పలువురు కమీషనర్‌ను అభినందించారు. కాగా గురువారం పాల్వంచలోని లోతట్టు ప్రాంతాలైన సీతారామపట్నం, గట్టాయిగూడెం, కబీర్‌తండా తదితర ప్రాంతాలలో పర్యటించి వర్షపు నీటి ఉధృతిని పరిశీలించారు. నివారణ చర్యలు తీసుకొన్నారు. కొద్దిపాటి వర్షానికే కోట్ల రూపాయలతో నిర్మించిన దమ్మపేట ప్రధాన రహదారి ధ్వంసం కావటంతో ప్రజల నుండి పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# పోడు రైతుల జోలికెళ్లొద్దు

**తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల**



**ప్రజాపక్షం/పాల్వంచ :** అటవీ అధికారులు పోడు రైతుల జోలికి వెళ్ళొ ద్దని, వేధింపులకు గురి చేయొద్దని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాధం అన్నారు. మండల పరిధి మందెరికలపాడు పోడు రైతులు సాగు చేసుకొంటున్న భూమి అటవీ శాఖ కు చెందినది అంటూ బీట్ అధికారి పత్తి మొక్కలు పీకేస్తామంటు న్నారని గిరిజన రైతుల పట్ల బెదిరింపులకు పాల్పడుతున్నారు. దీనితో భయాందోళనకు గురైన పోడు రైతులు గురువారం ముత్యాల విశ్వనా ధంను కలిసి సంప్రదించి తమ గోడు వెళ్ళబోసుకొన్నారు. స్పంధించిన ఆయన రైతులతో కలిసి పాల్వంచలో గల ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ బి. బాబును ఆయన కార్యాలయంలో కలిశారు. పోడు రైతుల సమస్యలను అధికారి దృష్టికి తీసుకెళ్ళారు. దీనితో సదరు అధికారి మాట్లాడుతూ కొత్తగా నరికి సాగు చేస్తున్నట్లుగా మా దృష్టికి వచ్చిందని, పరిశీలించి చర్యలు తీసుకొంటామని చెప్పారు. దీనికి ముత్యాల స్పంధిస్తూ పత్తి మొక్కలు కాత, పూత దశలో ఉన్నాయన్నారు. మరో రెండు నెలలు పూర్తి అయితే పంట చేతికి వస్తుందన్నారు. అకారణంగా పత్తి మొక్కలు పీకేస్తే రైతులు తీవ్రంగా నష్ట పోతారని తెలిపారు. పోడు సాగు చేసు కొని జీవనం చేస్తున్న పేద రైతుల పట్ల మానవీయ కోణంలో తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కొత్తగా పోడు నరకొద్దని రైతులకు చెపుతూ పాత భూముల జోలికి అటవీ అధికారులు రావద్దన్నారు. కొత్త పోడు చేసేది లేదని పాత భూములను వదిలేదని లేదని అధికారికి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, రైతు సంఘం రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సబ్యులు వైఎస్ గిరి, శనగారపు శ్రీనివాసరావు నాయకులు, నిమ్మల రాంబాబు, కొంగర అప్పారావు, చిల్లా క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రైతాంగానికి సకాలంలో యూరియా అందించాలి





**ప్రజాపక్షం/దమ్మపేటః** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగానికి సరి పడా యూరియా సరఫరా చేయాలని సిపిఐ అనుబంధ రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని రైతులందరికీ సరిపడా యూరియా అందించాలని గురువారం దమ్మపేట తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, జూనియర్ అసిస్టెంట్ బి.నర్సింగ్ నాయక్ కి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జిల్లా సమితి సభ్యులు సుంకిపాక ధర్మ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలో వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న, ఆకు కూరలు, కూరగాయలు, ఇతర పంటలు సాగు చేసుకుంటున్న రైతులకు సకాలంలో యూరియా సరఫరా చేయా లని లేని పక్షంలో రైతులు నష్టాల బారిన పడే పరిస్థితిలు ఏర్పడతాయని అప్పులు చేసి సాగు ప్రారంభించిన రైతులకు యూరియా అందకపోవ దంతో దిగుబడి సన్నగిల్లి భారీ స్థాయిలో నష్టపోయి అప్పుల ఊబిలో కూలికిపోయే పరిస్థితి ఏర్పడుతుందని తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి సరిపడా 10 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేస్తామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు కేవలం 5.32 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేసి చేతులు దులుపుకుందని దీంతో రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందని రైతుల ఆందోళన చెందుతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రైతు సంఘం నాయకులు ఎస్ కే జాన్‌బీ, యార్లగడ్డ మణికంత, ఉమాకాంత్, గాజు బోయిన కృష్ణవేణి, నక్క నాగమణి, నల్ల ప్రసాద్, సత్యనారాయణ, వెంకమ్మ, సరిత, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

## యూరియా సరఫరాను పెంచి, రైతులందరికీ అందించాలి

**సిపిఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో మణుగూరులో భారీ ప్రదర్శన తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా**





**ప్రజాపక్షం/మణుగూరుః** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యూరియా సరఫ రాను పెంచి రైతులందరికి యూరియాను అందించాలని, కేంద్ర ప్రభుత్వం వివక్షను విడనాడాలని, రాష్ట్రవ్యాప్తంగా బ్లాక్ మార్కెట్లో యూరియా అధిక ధరల అమ్మకాలను నివారించాలని కోరుతూ సిపిఐ పార్టీ, రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం ఉదయం సిపిఐ కార్యాల యం నుండి బైక్ ర్యాలీ అంబేద్కర్ సెంటర్ మీదుగా తహశీల్దార్ కార్యా లయం చేరుకొని గంట సేపు ఆందోళన నిర్వహించారు. ఈ సంద ర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కావాలనే ఉద్దేశంతో తెలంగాణరాస్త్రం పై వివక్ష చూపుతుందని, రాష్ట్రానికి ఇవ్వాల్సిన 10 లక్షల మెట్రిక్ టన్నుల యూ రియాను సరఫరా చేస్తామని చెప్పి, కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు కేవలం 5.32 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా చేసే చేతులు దులుపు కుందని వారు ఆరోపించారు. రాష్ట్రం లో రైతులు యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్నారని, చిన్న, సన్నకారు రైతులు యూరియా కోసం లైన్ లో నిలబడి ఎదురుచూపులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రానికి యూరియా పంపిణీ చేయాలని, రాష్ట్రం లో రైతులు ఇబ్బంది పడకుండా యూరియా అం దించాలని వారు డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా సమితి సభ్యులు జంగం మోహన్ రావు, సిపిఐ పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ లు మాట్లాడుతూ జిల్లాలో మండలంలో వరి, పత్తి మిర్చి, మొక్కజొన్న, ఆకు కూరలు కూరగాయలు ఇతర పంటలు సాగు చేసుకుంటున్నా రైతులకు యూరియా సకాలంలో సరిపడా సరఫరా చేయలేకపోవడం వల్ల రైతులు నష్టాల బారిన పడే పరిస్థితి ఏర్పడిందని అప్పులు చేసి సాగు ప్రారంభించిన రైతులకు యూరియా అందకపోవడం వలన దిగుబడి సన్నగిల్లి భారీ స్థాయిలో నష్టం వచ్చి అప్పుల ఊబిలో కూరుకుపోయే పరిస్థితి ఏర్పడిందని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి పంపించాల్సిన యూరియాని వెంటనే పంపించాలని లేకపోతే పెద్ద ఎత్తున రైతులు నష్ట పోయే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ధర్నాలో సిపిఐ మణుగూరు మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, రైతు సం ఘం జిల్లా నాయకులు మంగి వీరయ్య, జిల్లా సమితి సభ్యులు కుటుం బరావు, ఎడారి రమేష్, ఏఐటీయూసీ మణుగూరు మండల అధ్యక్ష కార్యదర్శులు రాయల భిక్షం, గడ్డం వెంకటేశ్వర్లు, మహిళా సమైక్య మండల అధ్యక్ష కార్యదర్శులు బోలగాని సమ్మక్క, దుబ్బాక నిర్మల, కే సుజాత, పట్టణ సహాయ కార్యదర్శి తోట రమేష్ ఎస్ కే సర్వర్, మండల సహాయ కార్యదర్శి వేర్పుల నరేష్, రైతు సంఘం నాయకులు డండు గుల బాబు, ఐతనమైన వెంకన్న, పాయం లక్ష్మయ్య, బాడిస సతీష్, నోముల రవి, కనీతి సత్యనారాయణ, ఆధర్ల రాములు, కన్నెబోయిన ప్రసాద్, బోసెట్టి సంపత్, పులిగల రమేష్, యనమల సుధాకర్, చిక్కుల శివ, రంజిత్, పాయం శీను,గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యాలయాలలో ఓటర్ల జాబితా ప్రదర్శన

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద గురువారం ఓటర్ల జాబితా లను ప్రదర్శించారు. మండలం లోని 32 గ్రామ పంచాయతీ కార్యాలయాలలో పంచాయతీ కార్యదర్శులు ఫోటో కలిగిన ఓటర్ల జాబితాలను ప్రదర్శించారు. కాగా ఓటర్ల జాబితా పై అభ్యంతరాలు ఉంటే శుక్రవారం తెలియజేయవచ్చునని అధికారులు పేర్కొన్నారు. మండలం లోని పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటర్ల జాబితా లను మండల పరిషత్ అభివృద్ధి అధికారి యం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి సి.హెచ్.శివ పర్యవే క్షించారు. మండలం లోని కోనాయిగూడెం లో పంచాయతీ కార్యదర్శి బైరం దినేష్ కుమార్ జాబితా ను ప్రదర్శించారు. తిగుళ్ల భాస్కర్, కస్తాల గోపయ్య, బొడ్డు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. కొత్తకొ త్తూరు లో మాజీ సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ, బీజేపీ మండలాధ్యక్షుడు పాగర్తి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతాంగానికి సరిపడా యూరియా సరఫరా చేయాలి



**ప్రజాపక్షం/బూర్గంపాడు :** తెలంగాణ రాష్ట్ర వ్యాపితంగా రైతాంగానికి సరిపడా యూరియా సరఫరా చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మువ్వా వెంకటేశ్వరరావు, జిల్లా రైతు సంఘం నాయకులు అలవాల సీతారామిరెడ్డి అన్నారు. గురువారం సిపిఐ అనుబంధ రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే తహసీల్దార్ కార్యా లయం ముందు ధర్నా కార్యక్రమంలో భాగంగా మండలంలోని రైతు లందరికీ సరిపడా యూరియా అందించాలని తహసీల్దార్ కార్యా లయం ముందు ధర్నా నిర్వహించి, వినతి పత్రం అందించారు. ఈసం దర్భంగా వారు మాట్లాడుతూ బూర్గంపాడు మండలంలో వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న, ఆకుకూరలు, కూరగాయలు, ఇతర పంటలు సాగు చేసుకుంటున్న రైతులకు సకాలంలో యూరియా సరఫరా చేయా లన్నారు. లేనిపక్షంలో రైతులు నష్టాల బారిన పడే పరిస్థితులు ఏర్పడతా యని, అప్పులు చేసి సాగు ప్రారంభించిన రైతుకలు యూరియా అంద కపోవడంతో దిగుబడి సన్నగిల్లి భారీ స్థాయిలో నష్టపోయి అప్పుల ఊబిలో కూలిపోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. తెలంగాణరాష్ట్ర రైతాంగానికి సరిపడా 10లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరషరా చేస్తామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు కేవలం 5.32లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేసి చేతులు దులుపుకుందుని, దీంతో రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందని రైతులు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు పేరాల శ్రీనివాసరావు, సిపిఐ మండల కార్యదర్శి సబ్కా నాగేశ్వరరావు, సిపిఐ నాయకులు ముదిగొండ బాలకృష్ణ, భీమా, కుంజ నాగరాజు, భూక్య శ్రీను, సింగబోయిన వెంకటేశ్వర్లు, జగ్గయ్య, రాజేష్, మల్సూరు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు సరిపడా యూరియా అందజేయాలి



**ప్రజాపక్షం/ఇల్లందుః** తెలంగాణ రాష్ట్ర వ్యాపి తంగా రైతాంగానికి సరిపడా యూరియా సర ఫరా చేయాలని సిపిఐ అనుబంధ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం తహశీల్దార్ కార్యా లయం ముందు ధర్నా కార్యక్రమంలో భాగంగా మండలంలోని రైతులందరికీ సరిపడా యూరియా అందించాలని ఇల్లందు తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే. సారయ్య మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండ లంలో వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న, ఆకుకూరలు, కూరగాయలు, ఇతర పంటలు సాగు చేసుకుంటున్న రైతులకు సకాలంలో యూరియా సరఫరా చేయాలని లేని పక్షంలో రైతులు నష్టాల బారిన పడే పరిస్థితిలు ఏర్పడతాయని అప్పులు చేసి సాగు ప్రారంభించిన రైతులకు యూరియా అందకపోవడంతో దిగుబడి సన్నగిల్లి భారీ స్థాయిలో నష్ట పోయి అప్పుల ఊబిలో కూలికిపోయే పరిస్థితి ఏర్పడుతుందని, తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి సరిపడా 10 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేస్తామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు కేవలం 5.32 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేసి చేతులు దులుపుకుందని దీంతో రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందని రైతుల ఆందో ళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, సిపిఐ ఇల్లందు పట్టణ మండల కార్యదర్శులు బాస శ్రీనివాస్, బొప్పిశెట్టి సత్య నారాయణ, సిపిఐ నాయకులు ఉడుత ఐలయ్య, జె. మోజేస్, నిమ్మల రాము, ఆలెం రాఘవేంద్రరావు, బొల్లి కొమరయ్య, దారావత్ రాందాస్, కల్తీ రామ్మూర్తి, కొత్తపెల్లి సాంబమూర్తి, కే పీరయ్య, కే రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైతులందరికీ సరిపడా యూరియా అందించాలి





**ప్రజాపక్షం/పినపాకః** రైతులకు సరిపడా యూరియాను తక్షణమే సర ఫరా చేయాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో గురువారం పినపాక మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, వినతి పత్రం అందజేశారు. మిర్చి, వరి, పత్తి మొక్కజొన్న, ఆకు కూరలు, కూరగాలు, ఇతర పంటలు సాగు చేసుకుంటున్న రైతులకు యూరియా సకాలంలో సరిపడి సరఫరా చేయకపోవడం వల్ల రైతులు నష్టాల భారిన పడే పరిస్థితులు ఏర్పడ్డాయని, అప్పులు చేసి సాగు ప్రారంభించిన రైతు లకు యూరియా అందకపోవడంతో దిగుబడి సన్నగిల్లి భారీ స్థాయిలో నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారు. తెలంగాణ రాష్ట్రం రైతాంగాకి సరిపడా 10 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేస్తామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు కేవలం 5.32 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేసి చేతులు దులుపుకుంది. దీంతో రాష్ట్రంలో యూరియా కొరత ప్రమాదకర స్థాయికి చేరుకోవడంతో రైత న్నలు ఆందోళనలకు గురి అవుతున్నారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు స్పందించి జిల్లా, పినపాక మండల రైతాంగానికి సరిపడా డిమాండ్ అనుగుణంగా యూరియా సకాలంలో సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని, యూరియా పంపిణీలో అవినీతి, పైరవీలు, దళారీ వ్యవ స్తను అదుపుచేసి ప్రతీ రైతుకు యూరియా అందించాలని, అదే విధంగా పూర్తి సబ్సిడీతో ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ పరికరాలు అందించాలని ఏఐకెఎస్ అనుబంద తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా మండల తహశీల్దార్ కు వినతిపత్రం అందజేశామన్నారు. ఈ యొక్క వినతిపత్రాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదించి యూరియా కొరత సమస్యలను పరిష్క రించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో గడ్డం మనో హర చారి, సిపిఐ జిల్లా నాయకులు, తోగటి కుమార్, ఏఐటీయూసీ, మండల కార్యదర్శి, పత్తిపాటి నాగేశ్వరరావు, సిపిఐ జిల్లా నాయకులు, పద్మనాభ రాజు సిపిఐ మండల కార్యదర్శి,గడ్డం వెంకటాచారి సిపిఐ జాయింట్ సెక్రటరీ, మన్యం ఐలయ్య రైతు సంఘం మండల కార్య దర్శి, వర్స నరసింహారావు, గురజాల సుబ్రహ్మణ్యం, రమణాచారి, తంగేళ్లపల్లి వెంకన్న రైతులు తదితరులు పాల్గొన్నారు.

## యూరియాను రైతులకు సకాలంలో అందించాలి



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** రైతులకు యూరియాను సకాలంలో అందించాలని కోరుతూ సిపిఐ, ఎఐకెఎస్ ఆధ్వర్యంలో గు రువారం అశ్వారావుపేట తహశీల్దార్ కార్యా లయం ఎదట ధర్నా నిర్వహించి తహశీల్దా ర్‌కు వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సంద ర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సయ్యద్ సలీం మాట్లాడుతూ ముమ్మరంగా పంటలు సాగు చేస్తున్న సమ యంలో యూరియా కొరత వల్ల రైతులు అనేక ఇబ్బందులకు గురవుతు న్నారన్నారు. సకాలంలో పంటలకు అవసరమయ్యే యూరియా సర ఫరా చేయటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందటంతో రైతాంగా తీవ్ర ఆందోళన చెందుతున్నారని, ప్రభుత్వాలు స్పందించి రైతులందరికీ సరిపడా యూరియాను అందించాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్, ఆగస్టు మధ్య కాలంలో కేంద్ర ప్రభు త్వం కేటాయించిన యూరియా కోటలో దాదాపు మూడు లక్షల టన్నుల యూరియా రాష్ట్రానికి అందలేదని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పేర్కొన్నారని తెలిపారు. యూరియా కొరత అడ్డుపెట్టుకుని ప్రైవేట్ వ్యాపారులు బస్తాకు 70శాతం అధికంగా వసూలు చేస్తే రైతులను నిలువు దోపిడి చేస్తున్నారన్నారు. రామగుండం ఎరువుల కర్మాగారాన్ని సత్వరమే మరమ్మత్తు చేసి యూరియా కొరతను తొలగిం చడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు గన్నిన రామకృష్ణ, అశ్వా రావుపేట మండల రైతు సంఘం నాయకులు, ప్రజా సంఘాల నాయ కులు, సిపిఐ శ్రేణులు పాల్గొన్నారు.

## యూరియా సరఫరా చేయాలి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** రైతాంగానికి సరిపడా యూరియా సరఫరా చేయాలని సిపిఐ అనుబంధ రైతు సంఘం ఆధ్వ ర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే తహ సీల్దార్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమంలో భాగంగా మండలంలోని రైతులందరికీ సరిపడా యూరియా అందించాలని ములకలపల్లి తహసీల్దార్ కార్యాలయం ముందు గురువారం ధర్నా నిర్వహించి, వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు ఎండి యూసుఫ్, జిల్లా రైతు సంఘం కార్యదర్శి నరాటి రమేష్‌లు మాట్లాడుతూ ములకలపల్లి మండలంలో వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న, ఆకుకూరలు, కూరగాయలు, ఇతర పంటలు సాగు చేసుకుంటున్న రైతులకు సకాలంలో యూరియా సర ఫరా చేయాలన్నారు. లేనిపక్షంలో రైతులు నష్టాల బారిన పడే పరిస్థితులు ఏర్పడతాయని, అప్పులు చేసి సాగు ప్రారంభించిన రైతుకలు యూరియా అందకపోవడంతో దిగుబడి సన్న గిల్లి భారీ స్థాయిలో నష్టపోయి అప్పుల ఊబిలో కూలిపోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. తెలంగాణరాష్ట్ర రైతాంగానికి సరిపడా 10లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరషరా చేస్తా మని చెప్పిన కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు కేవలం 5.32లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేసి చేతులు దులుపుకుందుని, దీంతో రాష్ట్రంలో యూరియా కొరత ఏర్ప డిందని రైతులు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు యూరియా సరఫరా చేయాలి



**ప్రజాపక్షం /గుండాల :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే రైతులకు యూరి యాను సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ పార్టీ రైతుసంఘం ఆధ్వ ర్యంలో గురువారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తహసీల్దారుకు వినతి పత్రాన్ని అందించారు. పార్టీ మండల కార్య దర్శి వాగబోయిన రమేష మాట్లాడుతూ , కేంద్ర ప్రభుత్వం కావాలనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్రంపై వివక్షత చూపుతు రాష్ట్రానికి ఇవ్వాల్సిన 10 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేస్తామని చెప్పి కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు 5.32 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేసి చేతు లెత్తేసిందని అన్నారు. యూరియాను కొంతమంది దళారులు బ్లాక్ మార్కెట్‌లో అధిక ధర లకు అమ్ముతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి రావా ల్సిన యూరియాను వెంటనే పంపాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున రైతులు నష్టపోయో ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి జిల్లాకు రావాల్సిన యూరియాను సరఫరా చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బచ్చలి రామయ్య, దశరధి, నర్సయ్య, బుచ్చయ్య, సమీర్, వంశి, ఎస్కే షాహెద్‌పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హాయంలోనే నెరవేరుతున్న పేదోడి సొంతింటి కల



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** కాంగ్రెస్ హాయంలోనే పేదోడి సొంతింటి కల నెరవే రుతుందని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతా రాములు పేర్కొన్నారు. మండలం లోని మండ్రాజుపల్లి లో 18 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హాయంలో ఒక్క ఇంటిని కూడ ఇవ్వలేకపోయిందని అన్నారు. కాంగ్రెస్ 18 నెలల పాలన లోనే అనేక మంది కి ఇందిరమ్మ ఇళ్ల ను మంజూరు చేసిందని అన్నారు. అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి ఇంటిని మంజూరు చేస్తుందని అన్నారు. గుడిసె లేని గ్రామాలు గా ప్రభుత్వం తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటుందని అన్నారు. మంత్రి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవతో పాలేరు అన్ని రంగాలలో అభివృది పరుగులు తీసుందని అన్నారు. ఈ మండల తహసీల్దార్ వేంకటేశ్వర్లు, రెవిన్యూ ఇన్స్పెక్టర్ అల్లం రవి, కాంగ్రెస్ నాయకులు బచ్చలకూరి నాగరాజు, బొందయ్య, మామిడి వెంకన్న, తుమ్మ ఉపేందర్, తోళ్ళ ఉపేందర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## వర్షాలతో రోడ్డు అడ్డంగా భారీ వృక్షం



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** మండల వ్యాప్తంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా నందిపాడు, ఆసుపాక గ్రామాల మధ్య భద్రాచలం రోడ్డులో బుధ వారం అర్ధరాత్రి భారీ చింత చెట్టు రోడ్డుకు అడ్డంగా పడిపోవటంతో రెండువైపులా వాహ నాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంత రాయం కలిగింది. దీంతో సమాచారం తెలుసు కున్న పోలీసులు సంఘటన స్థలం వద్దకు చేరుకుని వాహనాలను దుద్దిపాడు మీదుగా మళ్లించి చెట్టును తొలగించి ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేశారు. రెండురో జులుగా వర్షం కురుస్తుండటంతో లోతట్టు ప్రాంతాలు మునిగిపోయాయి. రోడ్లపైకి నీరు భారీగా రావటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వినాయక మండపాల్లో పూజలకు కొంత అంతరాయం కలిగింది.

# భారీవర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: సిపి

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాగులు ఉదృతంగా ప్రవహిస్తుండటంతో నీట మునిగిన రోడ్లను దాటే ప్రయత్నం చేయవద్దన్నారు. ఎవరూ చేపల వేటకు వెళ్లవద్దని, పశువుల కాపరులు జీవాలను మేతకు చెరువులు, వాగులు పరివాహక ప్రాంతాలకు తీసుకువెళ్లద్దని వాగులు దాటే ప్రయత్నం చేయవద్దన్నారు. యువత సెల్ఫీలకోసం ప్రవాహాల వద్దకు వెళ్లి ప్రమాదాల భారిన పడవద్దని హెచ్చరించారు. పిల్లలు ఇంట్లో నుంచి బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. ఇప్పటికే చెరువులు, వాగుల వద్ద పోలీసు పహారా మోహరించినట్లు తెలిపారు. వరద తాకిడి, ఉదృతి ఎక్కువగా ఉన్న చప్టాలు, కాజ్‌వేలు, వంతెనల వద్ద రాకపోకలను నియంత్రించేందుకు బారికేడ్లు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పరివాహక ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులతో పాటు పోలీసు పెట్రోలింగ్ పెంచామని పేర్కొన్నారు. మున్నేరు కు వరద ఉదృతి అంతకంతకూ పెరుగుతున్న దృష్ట్య పరివాహక, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. అత్యవసర సమయంలో డయల్ 100కు, స్థానిక పోలీసు కంట్రోల్ రూమ్ సెల్ నెంబర్ 8712659111, కలెక్టర్ కార్యాలయం



టోల్‌ఫ్రీ నెంబర్ 1077 సెల్ నెంబర్ 9063211298 సమాచారం అందించాలని సిపి సూచించారు.

**పగిడేరు వాగు పరిశీలన...**

కొణిజర్ల మండలం లాలాపురం తీగలబంజరా సమీపంలో ఉన్న పగిడేరు వాగు వరద ప్రవాహాన్ని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ పరిశీలించారు. వరదలు, భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తీసుకోవలసిన జాగ్రత్తలను ఆయన స్థానికులకు తెలియజేశారు.

# రైతులను ఆదుకోండి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** తుఫానుకు పూర్తిగా దెబ్బతిన్న పంటలను పరిశీలించి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఖరీఫ్ సాగులో ఉన్న పంటలు పూర్తిగా దెబ్బతినడంతో రైతులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలభీమా పథకం అమలు లేకపోవడంతో రైతులకు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. తక్షణమే ప్రభుత్వం పంట నష్టపరిహారంపై దృష్టిసారించాలని తెలిపారు. ఈ సమయంలో రైతులు ఆదుకోకపోతే మరో పంటకు వెళ్లే పరిస్థితిలేదని దీనివల్ల ఆహార కొరత ఏర్పడే ప్రమాదం ఉందని తెలిపారు.. యూరియా కొరకు రైతులు వ్యవసాయ పనులు వదిలేసి పడిగాపులు కాయల్సి వస్తోందని అన్నారు. చేతికొచ్చిన పెసర పంట దెబ్బతిన్నదని అన్నారు. పెసరపంటను మార్క్‌ఫెడ్‌ద్వారా కొనుగోలు చేయడానికి ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పెసర ధానం పంట దళారుల పాలయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. పెసరపంటను మార్కెఫెడ్ ద్వారా కొనుగోలుచ చేయాలని డిమాండ్ చేశారు.

# గణేష్‌ని ఆశీస్సులతో ప్రజలంతా సుఖశాంతులతో జీవించాలి

**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :**



విఘ్నేశ్వరుడు అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, గణేష్‌ని ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని తిరుమలాయపాఎలం మం డల కాంగ్రెస్ నాయకులు తాటికొండ కిరణ్ ఆకాంక్షించారు. మండల కేంద్రంలో గణేష్ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బాబా యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. తిరుమలాయపాలెం గ్రామంలో వినాయక మండపంలో పూజలు చేశారు. ఈసందర్భంగా కిరణ్ మాట్లాడుతూ ప్రజల్లో మత సామరస్యం దైవ భక్తి, సమిష్టితత్వం మరింతగా బలోపేతం కావాలన్నారు. దేశం ఐక్యత శాంతి పురోగతి శ్రేయస్సు కోసం ఆధ్యాత్మిక చైతన్యాన్ని ప్రజల్లో పెంపొందించడానికి గణేష్ ఉత్సవాలు నిర్వహణ ఎంతో ఉపకరిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పొట్ల ప్రవీణ్, కోసమా హరినాథ్, గోకినపల్లి పిచ్చయ్య, లింగం పల్లి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# చెరువును తలపిస్తున్న తాటిపూడి వద్ద ఆర్అండ్‌బి రోడ్డు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం తాటిపూడి వద్ద మోకాళ్ళ లోతు గుంటలు ఏర్పడటంతో కురిసిన వర్షానికి నీరు నిలబడి చెరువును తలపిస్తుంది. నిలిచిన వరద నీటిలో పశువులు పడుకునే విధంగా ఉంది. ఈ రోడ్డును కనీసం ఆర్అండ్‌బి అధికారులు కనీసం పట్టించుకున్న పరిస్థితులు కనిపెట్టడం లేదు. ఈ గుంటలతో గ్రామస్థులు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటు వాహనదారులు ఇటు గ్రామస్థులు గుంటలతో ఎప్పుడు ఏమి ప్రమాదం జరిగిద్దని ఆందోళన చెందుతున్నారు. అధికారులు మౌనం వీడి ఏర్పడిన గుంటలకు మరమ్మత్తులు చేపట్టి ప్రమాదం జరగకుండా చూడాలని కోరుతున్నారు.

**ఆర్అండ్‌బి అధికారులు నిర్లక్ష్యం**
**అధికారులు రోడ్డును పట్టించుకోవాలి : యామాల**

**అధికారులు రోడ్ల మరమ్మత్తులు పట్టించుకోరా: యామాల**

రోడ్లపై ఏర్పడ్డ గుంటలతో ప్రజల ప్రాణాలు పోయేంత వరకు ఆర్అండ్‌బి అధికారులు పట్టించుకోరా అని సిపిఐ మండల కార్యదర్శి యామాల గోపాలరావు ప్రశ్నించారు. తాటిపూడి వద్ద ఏర్పడిన గుంటలతో ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయని ఎంతోమంది క్రిందపడి దెబ్బలు తగిలాయని, ఎందుకు అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రోడ్లు మరమ్మత్తులపై మంత్రులు ఎందుకు స్పందించడం లేదు. స్థానిక అధికారులు రోడ్ల మరమ్మత్తులు విషయంలో మౌనం వీడి ప్రజలకు ప్రమాదాలు జరగకుండా వాహనదారులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవలని యామాల గోపాలరావు అన్నారు.

# లోతట్టు వాగులపై బ్రిడ్జిలు నిర్మించాలి

**సిపిఐ మండల కార్యదర్శి గడల**

**ప్రజాపక్షం/కొణిజర్ల :** వర్షాకాలంలో భారవరదలు వచ్చినప్పుడు లోతట్టు వాగులపై బ్రిడ్జిలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం వెంటనే లోతట్టు వాగులపై బ్రిడ్జిలు నిర్మించాలని సిపిఐ కొణిజర్ల మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు అన్నారు. గురువారం ఆయన కొణిజర్ల లో మాట్లాడుతు మండల పరిదిలోని తీగలబంజర వద్దగల పడిడేరు. అంజనాపురం జన్నారం మధ్య నిమ్మవాగు, తనికెళ్ల తుమ్మలపల్లి వద్ద గల సవిటిరేవు వాగులు వద్ద భారీ వర్షాలకు లోతట్టు బ్రిడ్జిలపై నుంచి ఉధృతంగా నీరు ప్రవహిస్తుందని తెలిపారు. తీగలబంజర వద్ద గల పగిడేరు వరదరావడంవ



లన పల్లిపాడునుంచి ఏన్కూరువరకు వెళ్లే రాకపోకలకు ఇబ్బంది కలిగి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని దీనివలన అనారోగ్యంతో ఉండి వైద్య సౌకర్యాలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని అన్నారు. స్వతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు అయినా ఇంకా వాగులపై బ్రిడ్జిలు నిర్మించకపోవడం శోచనీయమని తెలిపారు. వెంటనే స్థానిక ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ జోక్యం చేసుకొని ఈ వాగులపై బ్రిడ్జిలు నిర్మించాలని పేర్కొన్నారు. లేనిపక్షంలో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో మిగతాపార్టీలను కలపుకొని అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/వైరా:** కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వైరా ఎస్సై పి.రామారావు అన్నారు. గురువారం వైరా లోని లోతట్టు ప్రాంతాలు అయినా రాజీవ్ నగర్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ ప్రాంతాలను మున్సిపాల్ సిబ్బందితో కలిసి ఎస్సై రామారావు పర్యటించారు. లోతట్టు వరద ప్రవాహం ప్రక్కన ఉన్న కుటుంబాలను అక్కడ నుంచి తరలించారు.



వరద ప్రవాహం పెరిగితే పునరావాస కేంద్రానికి తరలించే విధంగా ఏర్పాట్లు కూడా చేశారు. వైరా మండలం స్నానాల లక్ష్మీ పురం, ముసలిమడుగు, గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, వర్షాలు ఇదేవిధంగా కురిస్తే వరద ప్రవాహం పెరిగి రిజర్వాయర్ అలుగుల వద్వారా వైరా నది ఉధృతంగా ప్రవహించే ప్రమాదం ఉందని, ఎప్పటికప్పుడు ప్రజలు వరద ప్రవాహాన్ని గమనిస్తూ ఉందని, ఎప్పటికప్పుడు ప్రజలు వరద ప్రవాహాన్ని గమనిస్తూ ఉండాలని ఆయన తెలిపారు. నీటి ప్రవాహం వద్దకు వెళ్లారు. నీటితో దిగి ప్రమాదాలకు గురికావద్దని ఆయన సూచించారు.

# స్తంభించిన రాకపోకలు




**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని భారీ వర్షాలకు పలు గ్రామాల మధ్య అలుగు వాగులు ప్రవహించడంతో రాకపోకలు నిలిచి పోవడంతో జనజీవనం స్తంభించిపోయింది. మండల పరిధి లోని లక్ష్మీ పురం కల్లూరు మధ్య అలుగు వాగు, పోచవరం పెద్ద కోరుకొండి మధ్య అలుగు వాగు, తాళ్లూరు వెంకటాపురం మధ్య అలుగువాగు, కొర్లగూడెం మధ్య అలుగువాగులు వాగులు పొంగి ప్రవహిస్తుండటంతో రాకపోకలు గత రెండు రోజుల నుంచి నిలిచిపోయాయి. జనజీవనం స్తంభించిపోవడంతో రాకపోకలు నిలిచిపోవడం వలన ఆయా ప్రాంతాలలో తహశీల్దార్ పులి సాంబశివుడు, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎస్సై హరిత తో పాటు ఎన్ఎస్పి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి స్పందించి ఆయా గ్రామాల మధ్య పంచాయతీ అధికారులను సిబ్బందిని బందోబస్తును ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ప్రవహిస్తున్న వాగులు వంకల వద్ద కు ప్రజలు వాటి వద్దకు వెళ్ళవద్దని అప్రమత్తంగా ఉండాలని అధికారులు ప్రజలను హెచ్చరించారు.

# నగేష్ కుటుంబాన్ని పరామర్శించిన వైరా ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/కొణిజర్ల :**



మండల పరిదిలోని చిన్నగోపతి గ్రామానికి చెందని కాంగ్రెస్‌పార్టీ నాయకులు సామాజిక సేవా కార్యకర్త పగడాల మనోజ్ కుమార్ గత వారం రోజుల క్రితం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వైరా శాసనసభ్యులు మాళోత్ రాందాస్‌నాయక్ గురువారం పగడాల మనోజ్ కుమార్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. నగేష్ కుటుంబాన్ని పరామర్శించి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. డిసిసి బ్యాంక్ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం కూడా మనోజ్ కుమార్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కుటుంబసభ్యులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని చెప్పారు. నగేష్ కుటుంమాన్ని పరామర్శించిన వారిలో వైరా నియోజవర్గ మాజీ ఎమ్మెల్యే బాణోత్ చంద్రావతి, మాజీ ఎమ్మెల్యే బాణోత్ మదన్‌లాల్ సతీమణి మంజుల, మేకల మల్లిబాబు, గోసు మధు, గూదె భద్రయ్య, యర్రా బాబు, చిత్తారి సింహాద్రి, పోట్ల కవిత, శ్రీనివాసరావు, దొండపాటి రమేష్, వడ్డే నారాయణరావు, చిన్నం మల్లేశం, పగడాల మధు, గుమ్మా రోశయ్య, చెరుకుమల్లి రవి, తాతా సుధాకర్, నర్రి మారయ్య, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, పొట్లపల్లి జీడయ్య, సవళ్ల ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# మండల వ్యాప్తంగా కొలువురీన గణనాథులు

**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల వ్యాప్తంగా వినాయక చవతి పండుగను పురస్కరించుకుని అన్ని గ్రామాల్లో బుధవారం మండపాలను ఏర్పాటు చేసి గణనాథుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో యువకులు పోటీలు పడి ఒక్కో గ్రామంలో నాలుగు నుండి ఐదు మండపాలను ఏర్పాటు చేశారు. ఎర్రుపాలెం వాసవి క్లబ్



ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను కొప్పు పరమేశ్వరరావు, నందనంపాటి నాగేశ్వరరావు, దూపుకుంట్ల అప్పారావులు పంపిణీ చేశారు. నవరాత్రులు నిర్వహించే మండపాల వద్ద నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై రమేష్‌కుమార్ తెలిపారు. వర్షాలు పడుతున్న కారణంగా మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరగకుండా కమిటీలు జాగ్రత్తలు తీసుకోవాలని ఎర్రుపాలెం విద్యుత్‌శాఖ ఎఇ అనూష తెలిపారు. మండపాల్లో ఏర్పాటు చేసిన విద్యుదీపకరణ ఎప్పటికప్పుడు పరిశీలించుకుని విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, మండపాల వద్ద విద్యుత్ వైర్లు క్రిందకు వ్రేళాడేటట్లు లేకుండా చేయాలన్నారు.

# భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలను నిర్వహించాలి

**ప్రజాపక్షం/ బోనకల్ :** బోనకల్ మండలంలో గణేష్ ఉత్సవాలు సందర్భంగా కమిటీల వారు ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను జరుపుకోవాలని బోనకల్ ఎస్సై పొదిలి వెంకన్న సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను ఆయన సందర్శించారు. ముందుగా జరిగిన పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా గణేష్ ఉత్సవాలను నిర్వహించుకోవాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. కమిటీ నిర్వాహకులు పోలీస్‌శాఖకు సహకరించి ఎటువంటి ఉద్రిక్తతలు, అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంతంగా ఉత్సవాలను ముగించాలని సూచించారు.

# రైతు సమస్యల పరిష్కారానికి ధ్వజమెత్తిన ఎఐకెఎస్

- యూరియా అందించాలంటూ తెలంగాణ రైతు సంఘం డిమాండ్
- జిల్లాలో ప్రదర్శనలు, ధర్నాలు, అధికారులకు వినతి పత్రాలు









**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం (ఏఐకేఎస్) ధ్వజమెత్తింది. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా ఆయా మండల కేంద్రాల్లో ఆందోళనలు చేపట్టి ప్రదర్శనలు చేసి ధర్నాలు నిర్వహించి అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. యూరియా కొరతతో రైతులు విలవిల్లాడి పోతున్నారని, యూరియాను సరఫరా చేయడంలో కేంద్రప్రభుత్వ విఫలమైందని, తెలంగాణ రాష్ట్రంపై కేంద్రం చవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తోందని రైతు సంఘం నేతలు మండిపడ్డారు. జిల్లాలో వ్యవసాయంపై ఆధారపడి చాలా మంది జీవిస్తున్నారు. ఇక్కడ అనేక రకాల వాణిజ్య పంటలతో పాటు ఆహార ధాన్యాలు, కూరగాయలు, ఆకు కూరలు, అపరాలు వంటివి సాగు చేస్తుంటారని, వ్యవసాయ సీజన్ ప్రారంభమైనప్పటికీ రైతులకు కావాల్సిన యూరియాను అందించక పోవడం దుర్మార్గం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు పురుగు మందుల వ్యాపారులు రైతులను దోచుకునే పనిలో ఉన్నారని, వ్యవసాయానికి కావాల్సిన యూరియా తక్షణమే సరఫరా చేయకుంటే జిల్లా వ్యాప్తంగా రైతాంగాన్ని ఏకం చేసి ఆందోళన చేయడం ఖాయమంటూ నేతలు హెచ్చరించారు.

**పాల్వంచలో...**

రాష్ట్రంలో రైతులకు సరిపడా యూరియాను తక్షణమే అందించాలని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం (ఏఐకేఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సంఘం రాష్ట్ర పిలుపులో భాగంగా యూరియా కొరతను తక్షణమే నివారించాలని డిమాండ్ చేస్తూ గురువారం పాల్వంచ పట్టణంలోని చంద్ర రాజేశ్వరరావు భవన్ నుండి రైతులు పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో బికేఎంయు జిల్లా అధ్యక్షులు వీసంశెట్టి పూర్ణ చంద్రరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, పాల ఉత్పత్తిదారుల సంఘం జిల్లా నాయకులు గుండాల నాగరాజు, రైతు సంఘం నాయకులు నిమ్మల రాంబాబు, ఇట్టి వెంకట్రావు, శనగారపు శ్రీనివాసరావు, వైఎస్ గిరి, డి చెన్నయ్య, మన్నెం వెంకన్న, నరహరి నాగేశ్వరరావు, కొంగర అప్పారావు, బానోత్ రంజిత్, గాజుల సత్యనారాయణ, పోలబోయిన వెంకటేశ్వర్లు, జర్పుల మోహన్, బాదావత్ శ్రీను, నిట్ట అమృతరావు, చల్లా కృష్ణ, జక్కుల సురేష్, ఎండపల్లి కృష్ణ, చంచలపురి శ్రీను, సాయిలు వెంకన్న, లావుడియా చందూలాల్, సీతారాం, బాలాజీ, లాల్ సింగ్, కరీం, లక్ష్మీ ,పద్మ, రమ్య తదితరులు పాల్గొన్నారు.

**కొత్తగూడెం ఏరియాలో...**

జిల్లా కేంద్రంలోని కొత్తగూడెంతో పాటు చుంచుపల్లి, లక్ష్మీ దేవిపల్లి మండలాల్లో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘంలో పిలుపులో భాగంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఈమేరకు కొత్తగూడెంలో రాష్ట్ర సమితి సభ్యులు సలిగంటి శీనివాస్, కొత్తగూడెం టౌన్ కార్యదర్శి కంచర్ల జమలయ్య, గుత్తుల శ్రీనివాస్, రఘు, షాహీం తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. అదే విధంగా లక్ష్మీ దేవిపల్లి మండల కార్యదర్శి లక్ష్మీ పతి, ఏఐకేఎస్ జిల్లా ఉపాధ్యక్షులు సపాట్ రవి తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందించారు. చుంచుపల్లి మండలంలో మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళీ, చుంచుపల్లి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టం నాగయ్య, పెనగడప సిపిఐ శాఖ కార్యదర్శి నీడల సుధాకర్, భూక్యా జనార్దన్ రాంజీ, మన్నె రమేష్, కట్ట వీరభద్రం తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆయా మండలాల్లో నాయకులు మాట్లాడుతూ బిజెపి పాలకులు తెలంగాణ రాష్ట్రాన్ని చిన్నచూపు చూస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా రైతులకు కావాల్సిన యూరియా నిల్వలను యుద్ధ ప్రాతిపదిక తెప్పించి సరఫరా చేయాలని లేదంటే జిల్లా వ్యాప్తంగా రైతులను ఏకం చేసి ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమాల్లో దారా శ్రీనివాస్, నోనావత్ గోవింద్, మిర్యాల రాము, దేవరగట్ల రాంబాబు, జలీల్ పాషా, కుంజ రాంబాబు, కోడి లింగయ్య, హరికృష్ణ, రాధాకృష్ణ, శ్రీను, రాంప్రసాద్, గోపి, శివ, సురేష్, రమేష్, రవి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**చర్లలో...**

కేవలం 5.32 లక్షల మెట్రిక్ టన్నులయూరియా సరఫరా చేయడం సరికాదని, రాష్ట్రా వాటాగా రావాల్సిన 10 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను తక్షణమే సరఫరా చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆంధ్ర వామన రావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడ్డగర్ల తాతాజీ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రదర్శనగా వెళ్లి తహశీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో చర్ల మండల కార్యదర్శి నూపా పోతయ్య, సహాయ కార్యదర్శులు కోటి ముత్యాలరావు, చల్లా లక్ష్మీ నారాయణ, కోడిరెక్కల రాజారావు, నర్సింహారావు,మహేష్, రమణ, రామారావు, సత్యనారాయణ, వీరబాబు, నాగేశ్వరరావు, తేజ, వెంకటేశ్వరరావు, బాబూరావు, గోపాలకృష్ణ, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

# బషీర్‌బాగ్ అమరవీరుల త్యాగాలు వృథా కాలేదు




**ప్రజాపక్షం/అశ్వాపురం:** ప్రపంచ బ్యాంక్ ఆర్థిక విధానాలను అవలంభించొద్దని, కరెంటు చార్జీలను పెంచొద్దని రెండు వేల సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రైతాంగం చేసిన మహత్తర పోరాటం వల్ల నేడు కరెంటు చార్జీలు ఇంకా సామాన్యులకు అందుబాటులో ఉండటానికి కారణమని, దాంట్లో అమరులైనటువంటి రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డిలా త్యాగం వృధా కాలేదని వారిని స్మరించుకుంటూ గురువారం సిపిఐ అశ్వాపురం మండల కార్యాలయంలో వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అనంతనేని సురేష్, ఏఐటియూసి జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్, ఏఐటియూసి మండల అధ్యక్షులు రాయపూడి రాజేష్, సిపిఐ మండల సహాయ కార్యదర్శిలు మేలపూర సురేందర్‌రెడ్డి, కొండపర్తి ప్రసాద్, దంతాల జగదీష్, తెల్లం వెంకటరమణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఈసపల్లి పవన్ సాయి, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రెడ్డిబోయిన వెంకన్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు అక్కెనపల్లి నాగేంద్రబాబు, కమటం వీరన్న, ఎడెల్లి కమలాకర్, మోతికూరి బాబూరావు, కొమ్ము రాజు, కంగాల లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

# వినాయక ప్రతిమల పంపిణీ



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్ర సారపాక వారి ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా పర్యావరణ హితమైన, ఏకో ఫ్రెండ్లీ వినాయక ప్రతిమలు ప్రజలకు ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమం సారపాక సెంటర్ వద్ద ఘనంగా ప్రారంభించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐటిసి పిఎస్‌పిడి సారపాక యూనిట్ హెడ్ రోటేరియన్ శైలేందర్ కుమార్ సింగ్ మాట్లాడుతూ పర్యావరణానికి అనుకూలంగా మట్టి వినాయక ప్రతిమలను సుమారు 1500 వరకు పంపిణీ చేస్తున్నామని, ప్రజలందరూ నిమజ్జనానికి అనువైన ఇటువంటి ప్రతిమలతోనే పూజలు నిర్వహించాలని మనవి చేశారు. క్లబ్ ప్రెసిడెంట్ రోటేరియన్ కునిశెట్టి రాంబాబు మాట్లాడుతూ ప్రజలందరూ మట్టి వినాయకులను మాత్రమే పూజించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చునని తెలిపారు. ఈకార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ చాంద్ బాషా, రోటేరియన్లు సాయిరాం, రంజిత్ కుమార్, చంద్రశేఖర్ యాగి, ప్రతాప్ కుమార్, కేవిఎస్ గోవిందరావు, ఏసోబు, రోటరాక్టర్ ప్రెసిడెంట్ విద్యావాని, సెక్రటరీ మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

# అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దు




**ప్రజాపక్షం/జూలూరుపాడు :** భారీ వర్షాల దృష్ట్యా అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దని తహసీల్దార్ టి శ్రీనివాస్, ఎంపీడీవో తాళ్లూరి రవిలు అన్నారు. గురువారం జూలూరుపాడు మండలం పాపకొల్లు, జూలూరుపాడు గ్రామాల మధ్య తుమ్మల వాగు పొంగి ప్రవహించడంతో సుమారు 20 గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈసందర్భంగా పలు ప్రాంతాలను వారు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భారీ వర్షాల దృష్ట్యా అధికార యంత్రాంగం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. అనంతరం జూలూరుపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీలక్ష్మీ , ఎస్ఐ బాదవత్ రవిలు మాట్లాడుతూ వర్షాలకు కల్వర్టు, చిన్న చిన్న బ్రిడ్జిల వద్ద నీరు ప్రవహిస్తున్నప్పుడు వాహనాలతో దాటడానికి సాహసం చేయరాదని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ అధికారులకు, లేదా డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. నిరంతరం పోలీసుల పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ప్రజలకు పోలీసుల సూచనలు సలహాలను పాటించాలని కోరారు.

# అష్టదిగ్బంధనంలో సత్తుపల్లి..!

-రాత్రికి రాత్రే కుంభవృష్టి -దారులన్నీ జలమయం
-రాకపోకలకు తీవ్ర అంతరాయం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఒక్క రాత్రిలోనే కురిసిన కుంభవృష్టి వానకు సత్తుపల్లి పట్టణం అష్ట దిగ్బంధంలో చిక్కుకుంది. రాత్రి రెండు గంటల నుండి ఉదయం 9 గంటల వరకు కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. పట్టణంలో అడ్డగోలు ఆక్రమణలతో నాళాలు మూసుకుపోవడంతో వరద నీరంతా కాలనీలపై పడింది. వరద నీరు భారీగా చేరుకోవడంతో జనజీవనం స్తంభించిపోయింది. కొన్ని ప్రాంతాలలో మూడు అడుగులకు పైనే నీరు రోడ్లపై ప్రవహిస్తూ ఉండడంతో పోలీస్ శాఖ అప్రమత్తమై వాహనదారులను అటువైపుగా రాకుండా చర్యలు చేపట్టింది. సత్తుపల్లి మండలం కిష్టారం వద్ద వరద పెరగటంతో ఖమ్మం, రాజమండ్రి వైపు వెళ్లే రాకపోకలను మధ్యాహ్నం వరకు పోలీసులు నిలిపివేశారు. విజయవాడ వెళ్లే మార్గంలో సత్తుపల్లి సమీపంలోని అర్బన్ పార్క్ వద్ద రోడ్డు పైకి వరద చేరడంతో విజయవాడ వైపు ప్రయాణాలు నిలిచిపోయాయి. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వగ్రామం దమ్మపేట మండలం, గండుగులపల్లి వైపు వెళ్లే మార్గం కూడా సత్తుపల్లి సమీపంలోని గాడిదల వాగు వద్ద వరదలో చిక్కుకుంది. కిష్టారం యాతాలకుంట మధ్యలో గల రెండు వాగులు భారీగా ప్రవహిస్తున్నడంతో ఆవైపుగా కూడా రాకపోకలు స్తంభించాయి. గంగారం గట్టు బజారులోని యానాదుల ఇల్లు జలదిగ్బంధంలో చిక్కుకోవటంతో వారినంతా గంగారం పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. నాలుగు వైపుల వరద తాకిడి పెరగడంతో సత్తుపల్లి అష్టదిగ్బంధంలో చిక్కుకుపోవటంతో గ్రామాల నుంచి పట్టణానికి వచ్చే ప్రజల సంబంధాలు తెగిపోయాయి. చెరువులు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. చేపలు రోడ్ల మీదే తేలి ఆడుతున్న నేపథ్యంలో వాటికోసం ప్రజలు ఏగపడటం కనిపించింది. ప్రజలు చెరువులు వాగులు వైపు వెళ్ళవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ దంపతులు పరిస్థితి పరిశీలించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

# మధ్యాహ్న భోజన కార్మికురాలి మృతి



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని చంద్రుపట్ల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న కార్మికురాలు పరిగడుపు చిట్టెమ్మ (62) గురువారం స్వగ్రామంలో అనారోగ్యంతో మృతి చెందింది. ఆమెకు భర్త, కుమార్తెలు, కుమారులు కలరు. ఆమె గత 20 సంవత్సరాలుగా మధ్యాహ్న భోజనం ను తయారు చేస్తూ పాఠశాల విద్యార్థులకు వడ్డిస్తూ సేవలందించింది. ఆమె గత రెండు నెలలుగా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూ వైద్యం పొందుతూ ఉండి గురువారం ఉదయం మృతి చెందింది. ఆమె మృతి పట్ల ఏఐటియూసీ జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు, సిపిఐ మండల కార్యదర్శి దామాల దయాకర్ రావు, మాజీ ఎంపీపీ రాజేశ్వరిలతోపాటు మధ్యాహ్న భోజన కార్మికులు అలివేలు, సుశీల, మారెమ్మ , పంచాయతీ కార్మికులు రాజశేఖర్, గ్రామ దీపికల సంఘం నాయకురాలు కృష్ణవేణి లతోపాటు కాంగ్రెస్ నాయకులు ముత్తయ్య తదితరులు ఆమె భౌతిక దేహంను సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా మధ్యాహ్న భోజనం కార్మికురాలుగా, జిల్లా నాయకురాలుగా ఉంటూ సేవలందించిందని ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని నివాళులర్పించారు.

# భారీ వర్షాలకు వరి పంట మునక



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని చిన్న కోరుకొండి, పోచవరం, చెన్నూరు, కొర్లగూడెం, పెద్ద కోరుకొండి, వద్ద సుమారుగా 200 ఎకరాలలో వాగులు వంకల వద్ద వరద ఉధృతికి వరి పంట మునక జరిగినట్లు రైతులు తెలిపారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి వరద ఉధృతికి వరి పంట మునకతో చేతికందే పరిస్థితులు లేదని జరిగిన నష్టాన్ని ఎలా పూడ్చాలో అర్థం కావడం లేదని రైతులు తెలుపుతున్నారు. రైతులు నష్టపరిహారాన్ని అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఖమ్మంసూర్యాపేట రహదారిపై ఆగి ఉన్న లారీని ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..హైదరాబాద్‌వైపు వెలుతున్న ఓ కంటైనర్ లారీ రిపేర్ అయ్యి రహదారిపై నిలిచిపోయింది. వెనుక నుంచి వస్తున్న సూర్యాపేట డిపో బస్సు డ్రైవర్ ప్రమాదవశాత్తూ ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలో బస్సు డ్రైవర్ తన క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో క్రేన్ ద్వారా బైటకి తీశారు. బస్సులో ప్రయాణిస్తున్న 30మందికి ఎటువంటి గాయాలు కాలేదు. బస్సు డ్రైవర్‌కు స్వల్పగాయలయ్యినట్లు తెలిపారు.

# గిరిజన గ్రామాల అభివృద్ధికి పటిష్ట కార్యాచరణ

**-శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గిరిజన గ్రామాల అభివృద్ధికి పటిష్ట కార్యాచరణ అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పిఎం ధర్తీ అబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసిన 63 మంది మాస్టర్లకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమ ప్రారంభంలో గురువారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజనుల వికాసానికి, సామాజిక, ఆర్థికాభివృద్ధి కోసం పిఎం ధర్తీ అబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ కార్యక్రమం రూపొందించడం జరిగిందన్నారు. రాబోయే ఐదేండ్ల పాటు ఈ కార్యక్రమం క్రింద రూ. 79.156 వేల కోట్లు ఖర్చు చేయనుందన్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం 70 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం భరిస్తాయన్నారు. ఖమ్మంజిల్లాలో తొమ్మిది మండలాల పరిధిలో 35 గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లోని గిరిజన జనాభాకు అందుబాటులో ఉన్న వనరులను పరిశీలించి ఇంకా ఏమేమి వసతులు కావాలో ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో గిరిజన జనాభాకు ప్రధాన మంత్రి అవాస్ యోజన క్రింద పక్కా ఇండ్లు, జల్ జీవన్ మిషన్ క్రింద త్రాగునీరు, ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన క్రింద గ్రామాల్లో రహదారులు ఉండేలా చూడాలన్నారు. పిఎం సూర్యఘర్ పథకం క్రింద గ్రామాల్లో ఆసక్తి గల గిరిజనుల ఇంటిపై సోలార్ విద్యుత్ ప్యానల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి కుటుంబానికి గ్యాస్ కనెక్షన్, ఆయుష్మాన్ కార్డు అందించాలన్నారు. అవసరమైన చోట అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, సమగ్ర శిక్షాభియాన్ క్రింద పాఠశాలల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. రోటిన్ కార్యక్రమంలా కాకుండా గిరిజనులకు కావాల్సిన సదుపాయాలు, వసతులు వారే నిర్ణయించుకునే విధంగా వారికి సులభతరం చేయాలన్నారు. ప్రతి గిరిజనుడికి విద్య, వైద్యం వంటి కనీస సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో అన్ని శాఖల సమన్వయంతో గిరిజనుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానని అధికారులతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు.ఈ సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎన్. విజయలక్ష్మి, డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కళావతిబాయి, జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి, మిషన్ భగీరథ ఇఇ పుష్పలత, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జలదిగ్బంధంలో శ్రీరామ్‌నగర్..!

**- పరిశీలించిన మున్సిపల్ కమిషనర్**
**- ముందే చెప్పిన ప్రజాపక్షం**
**- కాలనీవాసులకు అండగా నిలిచిన సిపిఐ**





**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌లో గల శ్రీరామ్‌నగర్‌కాలనీని కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, ఇరిగేషన్ ఈఈ రమేష్‌రెడ్డి గురువారం పరిశీలించారు. గత రెండురోజులుగా కురుస్తున్న వర్షాలతో ఈదుల చెరువు నిండి అలుగు పారి అయోధ్యనగర్, శ్రీరామ్‌నగర్‌లో వరదపోటెత్తింది. అలాగే శ్రీరామ్ నగర్‌లోకి వెళ్లే ప్రధానరహదారి వద్ద అలుగు కాల్వ రోడ్డుపై నుంచి నీరు ఉధృతంగా ప్రవహించింది.ఈ నేపథ్యంలో పరిస్థితిని పరిశీలించి, మున్సిపాలిటీ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.


వరదొస్తే మునకే...

**అండగా నిలిచిన సిపిఐ...**

బుధవారం ప్రారంభమైన వర్షంతో అంతకంతకు పెరుగుతున్న నీటి ఉధృతిపై సిపిఐ ఆధ్వర్యంలో కాలనీవాసులకు అండగా నిలిచారు. సిపిఐ నేత దండి రంగారావు నేతృత్వంలో పార్టీ శ్రేణులు, యువజన సంఘం సభ్యులు రాత్రి, పగలు పర్యవేక్షించారు. ఏదులాపురంమున్సిపాలిటీ అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశారు. అలాగే తమ సొంత జేసీబీ ద్వారా గండ్లు కొట్టించడంతో నీరు సాఫీగా వెళ్లింది. ముందస్తుగా స్పందించిన తీరుపై కాలనీవాసులు సైతం కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ పరిస్థితులలో చేసిన సహాయ,సహకరాలపై కమిషనర్ అభినందనలు తెలిపారు.

**ముందే చెప్పిన ప్రజాపక్షం**

కాలనీల మునకపై అగస్టు 15న ప్రజాపక్షం దిన పత్రిక వరదొస్తే మునకే అనే కథనాన్ని ప్రచురించింది. అలుగు కాల్వలు కబ్జాపై రాసిన అక్షారాలు అక్షరసత్యం అయ్యాయి. ఈ సమస్య వరదొచ్చిన ప్రతిసారి ఉత్పన్నమవుతున్నందున అధికారులు శాస్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఎంతైన ఉంది.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/ గుండాల :** భారీ వర్షా దృష్ట్యా ప్రజలు అత్యవసరమైతే తప్పా బయటికి రావద్దని సిఐ రవిందర్, ఇరిగేషన్ ఎఇ పృద్వి సూచించారు. గురువారం కొడవటంచ వద్ద గల ఏడుమెలికల వాగు, రోల్లగడ్డ వద్దగల మల్లన్న వాగు, కిన్నెరసాని వాగులను సందర్శించారు. సిఐ మాట్లాడుతూ ఉధృతంగా ప్రవహించే వాగులను దాటే సాహసం చేయవద్దని, ముఖ్యంగా పశువులు, మేకలు, గొర్ల కాప రులు వాగులు దాటే ప్రయత్నం చేవద్దని హెచ్చరించారు. రైతులు పొలాల్లో విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తగా ఉండాలని , వర్షం పడేటప్పుడు విద్యుత్ స్థంబాలను గాని వైర్లను గాని ట్రాన్స్ ఫారాలని తాకవద్దని కోరారు. నదీ ప్రవాహాలను వాహనాలను దాటించే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు.

# విస్తారమైన వర్షాలు..పొంగుతున్న చెరువులు



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** గత రెండు రోజులుగా కురుస్తున్న విస్తారమైన వర్షాల కారణంగా మండలంలో ఉన్నటువంటి వివిధ గ్రామాలలో ఉన్న చెరువులు పొంగిపొర్లుతున్నాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల అన్నపురెడ్డిపల్లి పంచాయితీ పరిధిలో ఉన్నటువంటి వెంకటాపురం రాళ్లచెరువుకు వరద నీరు చేరడం వలన నిండుకుండల నిండి రహదారిపై పారుగుతుంది. అబ్బుగూడెం గ్రామం పంచాయితీలో ఉన్నటువంటి ఈదుల వాగు అధిక ప్రవాహంతో రహదారిపై ప్రవహిస్తుంది. ఎటువంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా మండలంలోపి ప్రజలను అప్రమత్తం చేయుటకు స్థానిక ఎస్ఐ చంద్రశేఖర్ , రెవిన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బందితో కలిసి వరద ప్రవాహ ప్రాంతాలను సందర్శించి, కట్టుదిట్టమైన చర్యలను చేపట్టారు. రాత్రి వేళలో ప్రయాణికులకు ప్రమాద సూచికలను తెలియపరుస్తూ కానిస్టేబుల్‌తో సెంట్రింగ్ ఏర్పాటు చేశారు. మధ్యాహ్న సమయంలో జూలూరుపాడు సిఐ శ్రీలక్ష్మి మండలంలోని ప్రవాహ ప్రాంతాలను తనిఖీ చేశారు. రాత్రి సమయాలలో వర్షపాతం పెరిగి వరద ఉధృతి వచ్చినప్పుడు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు సలహాలు తెలియపరిచారు. ఈకార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# బషీర్‌బాగ్ విద్యుత్ పోరాట అమరవీరుల త్యాగాన్ని వృథా కానివ్వం : సాబీర్ పాషా



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** బషీర్ బాగ్ విద్యుత్ పోరాట అమరుల త్యాగాన్ని వృధా కానివ్వబోమని, వారి పోరాట స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా అన్నారు. పేద, మధ్య తరగతి వర్గాలు, రైతులకు భారంగా మారిన విద్యుత్ ఛార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ వామపక్షాలు చేపట్టిన ఛలో అసెంబ్లీ కార్యక్రమం సందర్భంగా బషీర్‌బాగ్ లో అప్పటి ప్రభుత్వం జరిపిన కాల్పుల్లో అమరులైన బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డిలను స్మరిస్తూ వారి చిత్రపటం వద్ద గురువారం సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ పాతికేళ్ల క్రితం జరిపిన విద్యుత్ పోరాటం చారిత్రాత్మకం అని, కమ్యూనిస్టు కార్యకర్తల పోరాటాల స్ఫూర్తిని మరింత పెంచాయన్నారు. పేదల కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి పోరాడిన స్ఫూర్తి ఎందరికో ఆదర్శం అన్నారు. ఆ అమరుల త్యాగాలతోనే ఉచిత విద్యుత్ పథకానికి అంకురార్పణ జరిగిందని గుర్తు చేశారు. విద్యుత్ పోరాట అమరుల స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న పాలకులపై తిరగహబడటానికి ప్రజలను చైతన్య వంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళీ, మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి ఎస్‌కె షాహీన్, పట్టణ నాయకులు గుత్తుల శ్రీనివాస్, ప్రజానాట్యమండలి నాయకులు జోగా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పండుగలు ఐక్యతకు వేదికగా నిలవాలి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పండుగలు, ఉత్సవాలు ప్రజల మధ్య ఐఖ్యతకు, సోదరభావాన్ని పెంపొందించేందుకు వేదిక కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మునిస్పల్ మాజీ వైస్ చైర్మన్ ఎస్‌కె సాబీర్ పాషా అన్నారు. పట్టణంలోని 30వ వార్డు మధురబస్తీలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రజలకు శుభా కాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సంస్కృతి సంప్రదాయాలు ప్రపంచానికే ఆదర్శం అన్నారు. కులమతాలకు అతీతంగా అన్ని పండుగలు కలిసిమెలిసి నిర్వహించుకోవడం మన ప్రాంతానికే కాకుండా యావత్ భారత దేశానికి ఐఖ్యతారాగానికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. గణేష్ ఉత్సవ కమిటీలు ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకోవడమే కాకుండా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టడం, అందర్నీ ఏకతాటిపైకి తీసుకురావడం అభినందనీయం అన్నారు. ఈఅనవాయితీని మున్నుందు కూడా కొనసాగించి ప్రజల్లో ఐఖ్యతను పెంపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కందుల భాస్కర్, 30వ వార్డు మాజీ కౌన్సిలర్ నేరెళ్ల సమైఖ్య, నాయకులు పిడుగు శ్రీనివాస్, పీక కృష్ణ, మంచినీళ్ల అజయ్, సుధాకర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పాలకులను నిలదీసిన ధీరుడు సురవరం



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పాలకులను ధైర్యంగా నిలదీసిన ధీరుడు, గొప్ప కమ్యూనిస్టు యోధుడు, ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి అని ఏఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి వర్క అజిత్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సురవరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ మంచి కమ్యూనిస్టుగా, ఉత్తమ పార్లమెంటంరియన్‌గా పనిచేసిన ఆయన తుది శ్వాస వరకు ప్రజల తరుపున పోరాడారన్నారు. విద్యార్థి రాజకీయాల నుండి దేశ రాజకీయాల్లోకి అడుగుపెట్టి సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా అనేక సమస్యలపై ఉద్యమించారన్నారు. పార్లమెంట్‌లో ప్రజా వ్యతిరేక విధానాలపై తన గళాన్ని వినిపించి దేశ రాజకీయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని చెప్పారు. దేశంలో సమానత్వం, దోపిడీలేని వ్యవస్థ ఉండాలంటూ ఆఖరి వరకు పట్టుపట్టారని అన్నారు. దేశంలో కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేంత వరకు అన్ని వర్గాల ప్రజలు పోరాటాల్లో పాల్గొనడమే ఆయనకిచ్చే ఘన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో సంజయ్, కల్పన, దీవెన, స్వప్న, స్రవంతి, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

# అదనపు ఆదాయం ఉపాధి అవకాశాలు పెంచేలా మోడల్ డెమో ఫామ్ : కలెక్టర్

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** జిల్లాలో ప్రజలకు అదనపు ఆదాయం, ఉపాధి అవకాశాలు పెంచేలా మోడల్ డెమో ఫామ్‌ను రూపొందించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం మోరంపల్లిబంజర్ గ్రామ పంచాయితీ పరిధిలోని కెనాల్ పక్కన ఉన్న నీటిపారుదల శాఖ భూమిలో నూతనంగా ఏర్పాటు చేయు మోడల్ డెమో ఫామ్ స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ డెమో ఫామ్‌ను ఏ విధంగా అభివృద్ధి చేయాలి అనే దానిపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ డెమో ఫామ్‌లో కూరగాయల సాగు, మట్టితో ఇటుకల తయారీ యూనిట్, వెదురు, వాక్కాయ కంచె, క్వాయిల్ యూనిట్ షెడ్, సోలార్ డ్రైవర్ ఏర్పాటు చేయడంతో పాటు మునగ చెట్లు పెంచే విధంగా ప్రణాళికలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ మోడల్ డెమో ఫామ్ ద్వారా రైతులకు మాత్రమే కాకుండా మహిళలకు కూడా ఉపాధి అవకాశాలు కలగడం, సరి కొత్త వ్యవసాయ పద్ధతులు పరిచయం కావడం ద్వారా అదనపు ఆదాయ వనరులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ కేఆర్‌కే ప్రసాద్, ఆర్ఐ నరసింహారావు, ఎస్సార్ ఎల్పి ఏఈ సందీప్, ఎంపీఓ బాలయ్య, ఏపీవో విజయలక్ష్మి, ఏపీఎం హేమంతిని, పంచాయితీ కార్యదర్శి భవాని, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ ఆర్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.